


ఆర్ఎన్ఐ/2009/ 28733 స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 46 తిరుపతి తేది : శనివారం 16 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS

## పశ్చిమాసియా యుద్ధం ప్రపంచంపై ప్రభావం

- యుఎఇ పర్యటనలో మోడీ
- హర్మూజ్ జలసంధి ఎప్పుడూ తెరిచే ఉండాలని స్పష్టీకరణ

అబుదాబి–ఆంధ్రనాడు, మే 15



ఐదు దేశాలు, ఆరు రోజుల పర్యటనలో భాగంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) చేరుకున్న ప్రధాని మోడీ.. యుఎఇ అధ్యక్షులు నహ్యాన్‌తో శుక్రవారం ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లటంతో పాటు పశ్చిమాసియా సంక్షోభంపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఎల్‌పిజి సరఫరా, వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల రంగాల్లో సహకారంతోపాటు పలు ఒప్పందాలు చేసుకున్నారు. భారత్‌లో మౌలిక సదుపాయాల రంగంలో 5 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్టు యుఎఇ ప్రకటించింది. అలాగే, వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం, నౌకల మరమ్మతు కేంద్రం ఏర్పాటుపై యూఏఈతో ఎంవోయూతో ఒప్పందం చేసుకున్నారు. మరోవైపు, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో యుఎఇపై ఇరాన్ దాడిని మోడీ ఖండించారు. "పశ్చిమాసియా యుద్ధం ప్రభావం ప్రపంచం మొత్తంపై ఉంది. అయితే, భారత్ ఎప్పుడూ చర్చలు, సంప్రదింపులకే ప్రాధాన్యమిస్తుంది. చమురు రవాణాకు కీలక మార్గమైన హర్మూజ్ జలసంధి ఎప్పుడూ తెరిచే ఉండాలి. అదేవిధంగా హర్మూజ్‌పై అంతా అంతర్జాతీయ చట్టాలకు

- మిగతా 2లో..

## జూన్ 21న నీట్ యూజీ రీ ఎగ్జామ్

- వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లోనే : ధర్మేంద్ర ప్రధాన్
- ప్రశ్నపత్రం లీక్‌తో రద్దయిన నీట్ పరీక్ష

న్యూఢిల్లీ –ఆంధ్రనాడు, మే 15




దేశవ్యాప్తంగా లక్షలాది మంది వైద్య విద్యార్థులు ఎదురుచూస్తున్న నీట్ యూజీ రీ–ఎగ్జామ్ తేదీని కేంద్రం ప్రకటించింది. జూన్ 21న నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) అధికారికంగా వెల్లడించింది. మే 3న జరిగిన పరీక్షా ప్రశ్నపత్రం లీక్ అవ్వడంతో ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తామని పేర్కొంది. విద్యార్థుల

- మిగతా 2లో..

## ఏపీ అంటే 'అడ్వాన్స్‌డ్ ప్రదేశ్'..

- చంద్రబాబు ఆలోచనలు మామూలుగా ఉండవు: రాజ్ నాథ్ సింగ్
- పుట్టపర్తిలో వేల కోట్ల విలువైన భారీ రక్షణ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం, విజన్‌పై రాజ్ నాథ్ సింగ్ ప్రశంసల వర్షం
- ఏపీని దేశానికే రక్షణ హబ్‌గా మార్చే ప్రణాళికలో భాగంగా కీలక అడుగులు
- కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటుకు 8 కంపెనీల సంయుక్త ప్రయత్నం
- రక్షణ ఉత్పత్తి, ఎగుమతుల్లో భారత్ అపూర్వ వృద్ధి సాధించిందని వెల్లడి

పుట్టపర్తి–ఆంధ్రనాడు, మే 15



ఆంధ్రప్రదేశ్‌ను దేశ రక్షణ రంగ పటంలో అగ్రస్థానంలో నిలుపుతూ, రాష్ట్ర చరిత్రలోనే ఒక చారిత్రక అధ్యాయానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అనంతపురం జిల్లా పుట్టపర్తి వేదికగా శుక్రవారం వేల కోట్ల రూపాయల విలువైన నాలుగు కీలక రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఏపీ సీఎం చంద్రబాబుతో

- మిగతా 2లో..

## ఇకపై పుట్టపర్తి భక్తికే కాదు.. దేశ భద్రతకు కూడా కేరాఫ్ అడ్రస్

- సీఎం చంద్రబాబు
- పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఆమ్కా) ప్రాజెక్టుకు శంకుస్థాపన
- రికార్డు సమయంలో ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చామని వెల్లడి
- రాయలసీమను రత్నాలసీమగా మార్చడమే లక్ష్యమని స్పష్టీకరణ
- రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు, ఉద్యోగ కల్పనే ధ్యేయమన్న ముఖ్యమంత్రి

పుట్టపర్తి–ఆంధ్రనాడు, మే 15



ప్రశాంతతకు, ఆధ్యాత్మికతకు నెలవైన పుట్టపర్తి గడ్డపై దేశ రక్షణ రంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. దేశీయ పరిజ్ఞానంతో ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్లను తయారుచేసే ప్రతిష్ఠాత్మక అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ ప్రాజెక్టుతో పుట్టపర్తి ఇకపై భక్తికే కాకుండా దేశ భద్రతకు కూడా కీలక చిరునామాగా మారుతుందని సీఎం చంద్రబాబు అన్నారు.

**పుట్టపర్తిలో నూతన అధ్యాయం**

పుట్టపర్తి ఇకపై ఆధ్యాత్మిక స్ఫూర్తి నుంచి వ్యూహాత్మక



## గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో ఏపీ..

- పవన్ కల్యాణ్ ప్రశంసలు
- పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన
- చారిత్రాత్మక ఘట్టమన్న పవన్ కల్యాణ్
- పారిశ్రామికంగా ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య

అమరావతి –ఆంధ్రనాడు, మే 15

ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో నిలిపే దిశగా రూ. 15,803 కోట్ల భారీ పెట్టుబడితో కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా ప్రాజెక్టులపై ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఏపీ పారిశ్రామిక చరిత్రలోనే

- మిగతా 2లో..

## గంగా-కావేరి నదుల అనుసంధానం నా కల

- పోలవరం నిర్వాసితుల పరిహారం పంపిణీలో సీఎం
- రూ.306.61 కోట్లు అందజేత
- పుష్కరాలకు ముందే పోలవరం జాతికి అంకితం

అమరావతి –ఆంధ్రనాడు, మే 15




గోదావరి–కావేరి నదుల అనుసంధానం జరుగు తుందని, గంగా–కావేరి నదుల అనుసంధానం కావాలనేది తన కల అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. అదే జరిగితే దేశంలో నీటి ఎద్దడి ఉండదని అన్నారు. ఉండవల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకున్న పోలవరం నిర్వాసితులకు శుక్రవారం వారికి సిఎం రూ.306.61 కోట్లు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని అందించారు. ఈ కార్యక్రమానికి జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు లబ్బీపేటలోని తన కార్యాలయం నుంచి సైకిల్‌పై సిఎం కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఆర్ అండ్ ఆర్ కాలనీలకు సంబంధించి ఇళ్ల తాళాలను ముఖ్యమంత్రి అందించారు. ఇళ్ల పట్టాల

- మిగతా 2లో..

## పొరుగు రాష్ట్రం నేతతో నన్ను పోల్చవద్దు..

- అండగా ఉంటానన్న నేతలు ఆ రోజు పారిపోయారు: పవన్ కల్యాణ్
- మంగళగిరిలో జనసేన ఉద్యమి సమావేశం
- శస్త్రచికిత్స తర్వాత తొలిసారిగా సమావేశానికి విచ్చేసిన పవన్
- జనసేన క్యాడర్ కు దిశానిర్దేశం
- 2019లో తనను రెండు చోట్లా ఓడించారని వెల్లడి

అమరావతి–ఆంధ్రనాడు, మే 15



ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత కోలుకున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన 'జనసేన ఉద్యమి' సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, గడిచిన కొన్నేళ్లలో తాను ఎదుర్కొన్న రాజకీయ సవాళ్లతో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను తొలిసారిగా వెల్లడించారు. గత ఎన్నికల్లో విజయం తన ఒక్కడిది కాదని, క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పనిచేసిన ప్రతి జనసైనికుడు, వీరమహిళ, ఉద్యమిదేనని స్పష్టం చేశారు. పార్టీ భవిష్యత్ నిర్మాణం, భావజాల వ్యాప్తి, ప్రభుత్వంలో జనసేన పాత్ర వంటి కీలక అంశాలపై కార్యకర్తలకు సుదీర్ఘంగా వివరించారు.

- మిగతా 2లో..

# జూన్ 21న నీట్ యూజీ రీ ఎగ్జామ్

(మొదటిపేజీ తరువాయి)

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో కొత్త తేదీలను ఎన్టీఏ వెల్లడించింది. పారదర్శకమైన రీతిలో జూన్ 21న పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది. అడ్మిట్ కార్డులు, పరీక్షా కేంద్రాల వివరాలను త్వరలోనే అధికారిక వెబ్‌సైట్‌లో పెడతామని పేర్కొంది. పునఃపరీక్ష రాసే విద్యార్థులు ఎలాంటి అదనపు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్టీఏ కోరింది. వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నీట్ పరీక్ష: ?కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నీట్ పరీక్ష నిర్వహిస్తామని కేంద్రమంత్రి ధరేంద్ర ప్రధాన్ వెల్లడించారు. వచ్చే ఏడాది నీట్ పరీక్షను సీబీటీ విధానంలో నిర్వహిస్తామని, మళ్లీ మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చూడటమే మా ధ్యేయమని చెప్పారు. జూన్ 21 నుంచి నీట్ రీ–ఎగ్జామ్ నిర్వహిస్తామన్న కేంద్రమంత్రి, జూన్ 14 నుంచి అడ్మిట్‌కార్డులు విడుదల చేస్తామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా ఈ సారి చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు ఎవరూ నష్టపోకూడదనే పరీక్ష రద్దుచేసి మళ్లీ నిర్వహిస్తున్నాం. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే మా ప్రధాన కర్తవ్యం. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలనేది మా మొదటి ప్రాధాన్యం. పేపర్ లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిని ఉపేక్షించబోము. పేపర్ ఎలా లీక్ అయింది? ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందనేది పూర్తి వివరాలు బహిర్గతమవుతాయి. సీబీఐ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలు చూసి భయపడొద్దు. అడ్మిట్‌కు సంబంధించి ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉంది. పరీక్ష ఫీజు లేకుండా విద్యార్థులకు ప్రయోజనం కల్పిస్తున్నాం. ప్రశ్నపత్రం లీక్ చేసిన వారిని వదిలిపెట్టేది లేదు సీబీఐ అదే పనిలో ఉంది. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నాం. వ్యవస్థ బలోపేతానికి మరిన్ని చర్యలు తీసుకుంటాం." అని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివరించారు.

**రీఎగ్జామ్ కు ఫీజు చెల్లించాల్సిన అవసరంలేదు ..ఎన్టీఏ**

దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా రీఎగ్జామినేషన్‌కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ క్లారిటీ ఇచ్చింది. ఇదిలాఉండగా నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి అధికారులు విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా, అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలు వచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి కూడా ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో బయటపడింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

# పశ్చిమాసియా యుద్ధం ప్రపంచంపై ప్రభావం

(మొదటిపేజీ తరువాయి)

కట్టుబడి ఉండాలి. అలాగే, ఇరాన్, యూఏఈని లక్ష్యంగా చేసుకున్న తీరు ఆమోదయోగ్యం కాదు. కానీ, ప్రస్తుత పరిస్థితిని యుఎఇ సంయమనంతో ఎదుర్కోవడం ప్రశంసనీయం. భారత్ ఎప్పుడూ యూఏఈతో చేతిలో చేయి వేసే నడిచింది. యూఏఈతో భారత్ అనుబంధం ఇకముందూ కొనసాగుతుంది." అని ప్రధాని మోడీ చెప్పారు.

**ఇంధన భద్రతపైనే ఫోకస్**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని ఐదు దేశాల పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, యుఎఇ అధ్యక్షునితో జరిగిన భేటీలో పశ్చిమాసియా యుద్ధంతో నెలకొన్న పరిస్థితులపై ఇరుదేశాధినేతలు చర్చించారు. అలాగే, యూఏఈలో నివసిస్తున్న 45లక్షల మంది భారతీయుల భద్రతపై చర్చలు జరిపారు.

# గంగా-కావేరి నదుల అనుసంధానం నా కల

(మొదటిపేజీ తరువాయి)

నిమిత్తం 62.05 ఎకరాలు, ల్యాండ్ టూ ల్యాండ్ కింద 520.02 ఎకరాలను గుర్తించినట్టు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగోసారి పరిహారాన్ని అందించినట్లు వివరించారు. 2025 సంక్రాంతి, దీపావళి సందర్భంగా రెండుసార్లు, ఈ ఏడాది ఉగాది సందర్భంగా మూడోసారి, కాటన్ జయంతి సందర్భంగా నాలుగోసారి పోలవరం నిర్వాసితులకు పరిహారం అందించామని సిఎం పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 29,936 మంది నిర్వాసితులకు సుమారు రూ.2,250 కోట్ల పరిహారం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాసితులు ముఖ్యమంత్రితో తమ బాధలు చెప్పుకున్నారు.

నిర్వాసితులకు డబ్బులివ్వలేనని, తాను ఏం చేయలేనని నాటి సిఎం జగన్ చెప్పడంతో తాము ఆందోళన చెందామని సిఎం చెప్పారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలకు గత ప్రభుత్వం రోడ్లు కూడా వేయలేదని అన్నారు. వరదల సమయంలో సర్వం కోల్పోయిన తమకు కనీసం బియ్యం పంపిణీ కూడా చేపట్టలేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం మాట్లాడుతూ.. కాటన్ జయంతి రోజున పోలవరం నిర్వాసితులతో సమావేశం కావడం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద నిధులు ఇవ్వడం ఆనందంగా ఉందని వివరించారు. ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదని, ఇబ్బందులు పడకూడదనేదే తన ఆలోచనని వివరించారు. నిర్వాసితులకు ఇబ్బంది లేకుండా చేసేందుకే పోలవరం జిల్లా ఏర్పాటు చేశామని, టెక్నాలజీ అనుసంధానం చేసి ప్రతి కుటుంబ ఆదాయం పెంచుతామని పేర్కొన్నారు. గిరిజన నియోజకవర్గాలైన పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాలను అన్ని విధాలా తీర్చిదిద్దుతామని, పోలవరం ప్రాజెక్టు అనుకున్న సమయానికి పూర్తవుతుందని తెలిపారు. నిర్వాసితుల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరగదని, ప్రాజెక్టు, టౌన్ షిప్, ఇండస్ట్రీ ఇలా ఏం వచ్చినా భూములు త్యాగాలు చేసేది రైతులేనని అన్నారు. వారసత్వంగా వచ్చిన భూములు పోతే బాధపడతారని, నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వనని తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గంలో రోడ్లు నిర్మిస్తున్నామని, 2022లో వరదల సమయంలో పోలవరం ముంపు ప్రాంతంలో పర్యటించి సమస్యలు గుర్తించానని అన్నారు. వరద బాధితులకు కనీసం భోజనం, నీళ్లు కూడా నాటి ప్రభుత్వం ఇవ్వలేదని, విశాఖలో హుదూద్ వచ్చినప్పుడు వారం రోజులు అక్కడే ఉండి పరిస్థితి చక్కదిద్దామని పేర్కొన్నారు. గత పాలకులు.. అధికారులను, కాంట్రాక్టరును, మార్చి ప్రాజెక్టును నాశనం చేశారని వివరించారు. 2027 పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు.

# ఇకపై పుట్టపర్తి భక్తికే కాదు..
# దేశ భద్రతకు కూడా కేరాఫ్ అడ్రస్

(మొదటిపేజీ తరువాయి)

రూ.15,803 కోట్ల వ్యయంతో 650 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా తొలిదశలో 7,500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సుమారు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. స్వదేశీ సాంకేతికతతో అత్యాధునిక యుద్ధ విమానాలను తయారు చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

**జెట్ స్పీడ్‌తో అనుమతులు**

ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసిన వేగాన్ని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు నిదర్శనమని అన్నారు. "ఈ ఏడాది 9వ తేదీన రక్షణ శాఖలో చర్చలు మొదలైతే, 20న ప్రతిపాదనలు అడిగారు. 24న మేం పంపాం, 28న కేంద్రం అంగీకరించింది. 29న అధికారులు స్థలాన్ని పరిశీలించి, 30న రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. ఈరోజు శంకుస్థాపన చేసుకున్నాం. జెట్ స్పీడ్‌తో ఫైటర్ జెట్ ప్రాజెక్టును సాధించాం" అని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు మంజూరులో కీలక పాత్ర పోషించిన ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**ఏపీకి రక్షణ కవచం**

'ఆమ్కా' ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న ఇతర రక్షణ, అనుబంధ పరిశ్రమల గురించి కూడా సీఎం ప్రస్తావించారు. మడకశిరలో భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్‌సీఎల్, దోనకొండలో బీడీఎల్ సంస్థలు రూ.2,959 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయని, దీనివల్ల 4-5 వేల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీ ద్వారా దేశంలోనే ఆధునిక డ్రోన్ ఎకోసిస్టమ్‌కు శ్రీకారం చుట్టామని, రూ.686 కోట్ల పెట్టుబడులతో 8 సంస్థలు వస్తున్నాయని, తద్వారా 2,500 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. శ్రీహరికోట నుంచి అంతరిక్ష శక్తి, నాగాయలంక నుంచి క్షిపణి శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తి, ఇప్పుడు పుట్టపర్తి నుంచి వైమానిక శక్తితో ఆంధ్రప్రదేశ్ దేశానికి రక్షణ కవచంగా నిలుస్తోందని చంద్రబాబు అన్నారు.

**రత్నాల సీమగా రాయలసీమ**

గతంలో కరవు సీమగా, రాళ్ల సీమగా పిలవబడిన రాయలసీమ రూపురేఖలు మారుస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. "ఒకప్పుడు శ్రీకృష్ణదేవ రాయల కాలంలో వీధుల్లో రత్నాలు రాశులుగా పోసి అమ్మిన ఈ గడ్డను మళ్లీ రత్నాల సీమగా మార్చే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంది" అని ఆయన అన్నారు. పెనుకొండలో కియా పరిశ్రమ విజయాన్ని ఉదాహరణగా చూపుతూ, కరువు సీమలో తయారైన కార్లు నేడు 80 దేశాల్లో తిరుగుతున్నాయని గుర్తుచేశారు. కడప స్టీల్ ప్లాంట్‌ను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ (జీ+ఫీ) ద్వారా త్వరలో బంగారం ఉత్పత్తి ప్రారంభమవుతుందని, రాయలసీమకు రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను కూడా తీసుకువస్తామని చెప్పారు.

**నీటిపారుదల, పరిశ్రమలతో దశ మార్పు**

రాయలసీమ అభివృద్ధికి నీటిపారుదల ప్రాజెక్టులే పునాది అని చంద్రబాబు పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన హంద్రీనీవా, తెలుగుగంగ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. గొల్లపల్లి రిజర్వాయర్ వల్లే కియా మోటార్స్ రాగలిగిందని గుర్తుచేశారు. సమర్థవంతమైన నీటి నిర్వహణతో నేడు మే నెలలో కూడా పుట్టపర్తి చెరువు నిండుగా ఉందని, ఇది సుపరిపాలనకు నిదర్శనమని అన్నారు. ఖనిజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ స్టీల్, సిమెంట్ పరిశ్రమలను, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ప్రోత్సహించి సీమ దశ మారుస్తామని భరోసా ఇచ్చారు.

**రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యం**

గత ఐదేళ్ల విధ్వంసకర పాలనతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలను తరిమేసి, క్రిమినల్ రాజకీయాలు చేశారని విమర్శించారు. ఈ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి రాష్ట్ర పునర్నిర్మాణానికి హామీ ఇచ్చామని గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రానికి మళ్లీ బ్రాండ్ ఇమేజ్ తీసుకొస్తామని చెప్పారు. తమ ప్రభుత్వం 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిందని, వీటి ద్వారా 24 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని ప్రకటించారు. రాష్ట్ర యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఇక్కడే అవకాశాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**పొదుపు ఉద్యమానికి పిలుపు**

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల (ఇరాన్–అమెరికా యుద్ధం) నేపథ్యంలో దేశ ఆర్థిక భద్రత కూడా ముఖ్యమని చంద్రబాబు అన్నారు. పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరలు, దిగుమతుల భారాన్ని తగ్గించేందుకు ప్రధాని మోదీ ఇచ్చిన ఏడు సూత్రాల పొదుపు మంత్రాన్ని పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వర్క్ ఫ్రమ్ హోమ్, బంగారం కొనుగోళ్ల తగ్గింపు, ప్రజా రవాణా వినియోగం, వంట నూనెల వాడకం తగ్గింపు, స్వదేశీ వస్తువుల ప్రోత్సాహం వంటివి పాటించి దేశానికి అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వం కూడా కాన్వాయ్‌లను తగ్గించడం వంటి చర్యలు చేపట్టిందని, ఈ పొదుపు ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకుని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఏపీ అంటే 'అడ్వాన్స్‌డ్ ప్రదేశ్'..

(మొదటిపేజీ తరువాయి)

కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా, యావత్ భారత రక్షణ రంగ స్వావలంబన ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**చంద్రబాబు విజన్‌పై ప్రశంసల జల్లు**

ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, పాలనా సామర్థ్యంపై ప్రశంసల వర్షం కురిపించారు. "నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎందరో నాయకులను చూశాను. కానీ, టెక్నాలజీ పట్ల చంద్రబాబుకు ఉన్న పట్టు, అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధత, భవిష్యత్తును అంచనా వేయగల ఆయన దూరదృష్టి చాలా అరుదుగా కనిపిస్తుంది. ఆయన ఆలోచనలు ఎప్పుడూ చిన్నవిగా ఉండవు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషికి కేవలం భారత్‌లోనే కాకుండా అంతర్జాతీయ వేదికలపైనా ప్రశంసలు దక్కాయి" అని కొనియాడారు. గూగుల్ వంటి బహుళజాతి సంస్థ తన ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఏపీని ఎంచుకోవడమే చంద్రబాబు సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. "చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అంటే ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదు, 'అడ్వాన్స్‌డ్ ప్రదేశ్'గా ఎదుగుతుందన్న పూర్తి విశ్వాసం నాకుంది" అని రాజ్ నాథ్ ధీమా వ్యక్తం చేశారు.

**వేల కోట్ల పెట్టుబడులతో కీలక ప్రాజెక్టులు**

పుట్టపర్తిలో ప్రారంభమైన ప్రాజెక్టుల వివరాలను రాజ్ నాథ్ సింగ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు భారత సైన్యం, వాయుసేన, నౌకాదళం.. ఇలా త్రివిధ దళాల సామర్థ్యాన్ని బలోపేతం చేస్తాయని వివరించారు.

1.అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఆమ్కా) కేంద్రం: ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) ఆధ్వర్యంలో, రూ.15,000 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఐదో తరం యుద్ధ విమానం 'అమ్కా' ప్రాజెక్టులో భాగంగా రూ.2,000 కోట్లతో కోర్ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రాన్ని పుట్టపర్తిలో ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి అత్యాధునిక సదుపాయం ప్రపంచంలోనే అతి కొద్ది ప్రదేశాల్లో ఉందని, ఇకపై ఆ జాబితాలో పుట్టపర్తి పేరు చేరనుందని అన్నారు.

2.భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) యూనిట్: రూ.480 కోట్లతో బీడీఎల్ ఏర్పాటు చేయనున్న ఈ కేంద్రంలో అత్యాధునిక అండర్‌వాటర్ సిస్టమ్స్, అటానమస్ అండర్‌వాటర్ వెహికల్స్, నెక్స్ట్ జనరేషన్ టార్పెడోలు తయారు చేస్తారు. ఇది మన నౌకాదళ సామర్థ్యాన్ని, బ్లూ ఎకానమీని బలోపేతం చేస్తుంది.

3.భారత్ ఫోర్జ్ (ఆగ్నేయ) యూనిట్: భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ అయిన ఆగ్నేయ ఎనర్జిటిక్స్, రూ.1,500 కోట్ల పెట్టుబడితో అధునాతన ఆయుధాల తయారీ కేంద్రాన్ని నెలకొల్పుతోంది.

4. హెచ్ ఎఫ్ సీఎల్ (ఎఫీజా) ఫ్యూజ్ ప్లాంట్: రూ.1,294 కోట్ల పెట్టుబడితో హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ ఆర్టిలరీ షెల్స్, బాంబులకు అవసరమైన ఎలక్ట్రికల్ ఫ్యూజ్‌ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది.

వీటితో పాటు, 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో ఒక 'డ్రోన్ సిటీ'ని ఏర్పాటు చేస్తున్నాయని, భవిష్యత్తులో ఈ ప్రాంతం ప్రపంచ డ్రోన్ హబ్‌గా మారుతుందని రాజ్ నాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

**'ఆత్మనిర్భర్ భారత్' దిశగా పయనం**

గత పదేళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రక్షణ రంగం స్వరూపం పూర్తిగా మారిపోయిందని రాజ్ నాథ్ అన్నారు. "2014లో మన దేశీయ రక్షణ ఉత్పత్తి కేవలం రూ.46,000 కోట్లు. నేడు అది రికార్డు స్థాయిలో రూ.1.54 లక్షల కోట్లకు చేరింది, త్వరలోనే రూ.1.75 లక్షల కోట్లను దాటుతుంది. ఒకప్పుడు రూ.600 కోట్ల లోపు ఉన్న మన రక్షణ ఎగుమతులు, నేడు సుమారు రూ.40,000 కోట్లకు చేరుకున్నాయి. ఇది మన స్వావలంబన ప్రయాణానికి నిదర్శనం" అని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టులు కేవలం రక్షణ రంగానికే పరిమితం కాకుండా, లక్షలాది ఉద్యోగాలు సృష్టించి, ఒక సంపూర్ణ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసి, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. బెంగళూరుకు సమీపంలో ఉన్న ఈ ప్రాంతాన్ని కర్ణాటకతో కలిసి ఒక భారీ 'మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్'గా తీర్చిదిద్దే ప్రణాళికపై ఆలోచించాలని ఆయన చంద్రబాబుకు సూచించారు. దేశ నిర్మాణం అందరి భాగస్వామ్యంతోనే సాధ్యమని, ఈ చారిత్రక కార్యక్రమానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన బృందానికి, రాష్ట్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో ఏపీ..

(మొదటిపేజీ తరువాయి)

ఇదొక చారిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో ఏర్పాటు కాబోతున్న 'ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్ట్ సెంటర్' దేశ రక్షణలో కీలకం కానుంది. స్వదేశీ సాంకేతికతతో తయారవుతున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం 'ఆమ్కా' ప్రాజెక్టులో ఏపీ భాగస్వామ్యం కావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రధాని మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని తెలిపారు. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 7,500 మంది యువతకు హై-వాల్యూ టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కేవలం విమానాల తయారీ మాత్రమే కాకుండా, రాష్ట్రంలో అత్యాధునిక 'డ్రోన్ ఎకోసిస్టమ్'ను అభివృద్ధి చేయడం ద్వారా డ్రోన్ టెక్నాలజీలో కూడా ఏపీ అగ్రగామిగా నిలవబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని పవన్ కొనియాడారు. ఈ భారీ ప్రాజెక్టు ఏపీకి రావడానికి సహకరించిన ప్రధాని మోదీకి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పొరుగు రాష్ట్రం నేతతో
# నన్ను పోల్చవద్దు..

(మొదటిపేజీ తరువాయి)

**ఆరోగ్య సమస్యలపై తొలిసారిగా స్పందన**

గత కొన్నేళ్లుగా తాను తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పోరాటం చేశానని పవన్ కల్యాణ్ వెల్లడించారు. "ఎన్నికలకు ఏడాది ముందు నుంచి ప్రచారంలో తిరగడం, కరోనా సమయంలో లంగ్ ఇన్ఫెక్షన్ రావడంతో నా ఆరోగ్యం దెబ్బతింది. ఆ ఇన్ఫెక్షన్ ఇప్పటికీ పూర్తిగా తగ్గలేదు. దుమ్ము, ధూళిలో తిరగడం వల్ల సైనస్ ప్రాంతంలో దుమ్ము పేరుకుపోయి గట్టిపడిపోయింది. దీనివల్ల నా గొంతు కూడా చాలాకాలం ఇబ్బంది పెట్టింది. ఒక దశలో కంటి చూపులో కూడా తేడా వచ్చింది. భీమవరంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకుని హైదరాబాద్ వెళ్లి చికిత్స తీసుకోవడానికి నెల రోజులు పట్టింది," అని వివరించారు. అభిమానుల ప్రేమ వల్లే తన భుజాలకు గాయాలయ్యాయని పవన్ భావోద్వేగంతో తెలిపారు. "నా రెండు భుజాల్లో కండరాలు తెగిపోయాయి (టేర్). ఎలా జరిగిందని వైద్యులు అడిగితే, మా వాళ్లు ప్రేమతో లాగేశారు అని చెప్పాను. షేక్ హ్యాండ్ ఇచ్చినప్పుడు అభిమానులు ప్రేమతో గట్టిగా లాగడంతో కండరాలు తెగిపోయాయి. మీ ప్రేమతో తెగిన కండరాలను మళ్లీ మీ ప్రేమే బాగుచేస్తుంది," అని అన్నారు. వెన్నెముకలో కూడా 10 నుంచి 11 చోట్ల కంప్రెషన్స్ ఉన్నాయని, క్రీడా నేపథ్యం ఉండటంతో ఆ నొప్పిని తట్టుకోగలుగుతున్నానని తెలిపారు. "లోపల ఎంత నొప్పి ఉందో నాకే తెలియదు. నా పెయిన్ టాలరెన్స్ చాలా ఎక్కువ. అయినా మీ అందరి ఆశీస్సులతో నేను బాగుంటాను" అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

ANDHRANADU
TELUGU DAILY

శనివారం
16.05.2026

తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం

ఆంధ్రనాడు

# ఉరుసు కార్యక్రమం జయప్రదం చేయండి



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 15 :** మండలంలోని రాయలపేటలో వెలసిన సైదానీమా బీబీ సాహెబ్ దర్గా వద్ద నెల 23, 24 వ తేదీన నిర్వహించే ఉరుసు కార్యక్రమం జయప్రదం చేయాలని గ్రామంలోని పలువురు కోరారు. 23 వ తేదిన గంధం ఊరేగింపు కార్యక్రమం, 24న ఖవ్వాలి (పాట కచ్చేరి ), అన్నదాన కార్యక్రమం జరుగుతాయన్నారు. ఈ ఉరుసు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం వైస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుహేబ్ నివాసంలో దర్గా కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా సుహేబ్ మాట్లాడుతూ రాయలపేట పరిసర ప్రాంత ప్రజలు కులమతాలకు అతీతంగా ఈ ఊరుసు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ, మండల మేథావుల సంఘం అధ్యక్షులు గురునాథరెడ్డి, దర్గా కమిటీ సభ్యులు అల్లాబక్షు, మదనపల్లి బావాజాన్, మాజీ వార్డు సభ్యురాలు సైదాని, మండల మైనారిటీ ప్రధాన కార్యదర్శులు ఇమాంవాలి, హానీఫ్,బాబ్జీ, ముజీబ్, ఇంతియాజ్, సమీవుల్లా, అంజాద్ ఖాన్, మౌలా పాల్గొన్నారు.

# అక్రమ గ్యాస్ సిలిండర్లు సీజ్



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 15 :** మండలంలోని శంకర్రాయలపేటలో అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలెండర్లను సీజ్ చేసినట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, రెవెన్యూ అధికారి రాకేష్ కుమార్ లు తెలిపారు. శుక్రవారం గ్యాస్ సిలిండర్లు అక్రమంగా పంపిణీ చేస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు దాడులు చేయగా గ్రామంలో ముగ్గురు వ్యక్తుల దగ్గర 27 గ్యాస్ సిలిండర్లు అక్రమంగా ఉన్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేసి సంబంధిత గ్యాస్ ఏజెన్సీలకు అప్పజెప్పినట్లు తెలిపారు.

# మరచిపోకుమా పుస్తకావిష్కరణ




ప్రముఖ కవి, రచయిత సురేంద్ర రొడ్డా రాసిన మరచిపోకుమా పుస్తకాన్ని తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడలో గల ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విమల సాహితీ సమితి అధ్యక్షులు జల్లి విద్యాధర రావు మాట్లాడుతూ వివిధ సంఘటనలను ఇతివృత్తాలుగా తీసుకుని తన కవిత్వంలో పొందుపరిచారన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన గుత్తా హరిసర్వోత్తమ నాయుడు మాట్లాడుతూ సమాజానికి దిక్సూచీలు లాంటి కవితలని, త్వరలో నవలకు నాంది పలకాలన్నారు. అనంతరం పుస్తక సమీక్ష చేసిన పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ యువశ్రీ మాట్లాడుతూ అక్షరం విలువ గురించి, సమాజంలోని సంఘటనలోని అణచివేత గురించి తన కవిత్వంలో అక్షరీకరించారన్నారు. చిత్తూరు మాండలికంలో రాసిన ఈ కవితలు మనసుకు హత్తుకునేలా ఉన్నాయన్నారు. కరోనా కాలంలో ప్రపంచమంతా అల్లకల్లోలం నాటి నుండి నేటి వరకు సమాజంలోని అసమానతలను, శ్రమ దోపిడీని,తన కవిత్వంలో తెలిపారు. చివరగా రచయిత సురేంద్ర రొడ్డా మాట్లాడుతూ కవితలు నా అనుభవాల సారమని నా జీవితంలో జరిగిన, ఎదురైన వాస్తవాల ప్రతిరూపాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, పేరూరు బాలసుబ్రమణ్యం, కృష్ణస్వామి రాజు, మల్లారపు నాగార్జున, ప్రసాద్, ఏడుకొండలు, కాంతారావు, విశ్వనాథ్ రెడ్డి, ఉషారాణి, జయరాం ప్రసాద్, పొక్కళ్ళ సుభద్ర, ఇస్లాపురం బాల సుబ్రహ్మణ్యం, చెన్నకేశవులు నాయుడు,గద్వాల సోమన్న, గజేంద్ర, దామోదర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే కూటమి లక్ష్యం

**- టీడీపీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**
**- ఎమ్మెల్యే పులివర్తి నాని**

తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, మే 15: ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలబడి వారి కష్టాలను తీర్చడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం తనపల్లిలోని రఘునాథ్ రిసార్ట్స్‌లో ఉన్న చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పలువురు బాధితులకు సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయనిధి) చెక్కులను ఆయన పంపిణీ చేశారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన పలువురికి రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా మొత్తం రూ.16 లక్షల 24 వేల 125 మంజూరు చేసినట్లు తెలిపారు. అనారోగ్యంతో పాటు ఇతర



సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుల పరిస్థితిని ఎమ్మెల్యే పులివర్తి నాని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ముఖ్యమంత్రి బాధితులకు సహాయం అందించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. కష్టకాలంలో తమ కుటుంబాలకు అండగా నిలిచిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నానికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తిరుచానూరు ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక

**- రోడ్డు విస్తరణ, పార్కింగ్ అభివృద్ధి**

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 15 :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం పెంపొందించడం, రాకపోకలు సజావుగా సాగడం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారాన్ని లక్ష్యంగా పెట్టుకుని తిరుచానూరు రోడ్డు విస్తరణ, పార్కింగ్ సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సమీక్షించారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్‌వో మురళీకృష్ణలతో కలిసి తుడా, టీటీడీ అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు విపులంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాలు సహా సాధారణ రోజుల్లో కూడా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని తెలిపారు. భక్తులకు



ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసరాల్లో రద్దీని తగ్గిస్తూ మెరుగైన దర్శన అనుభూతి కలిగేలా రోడ్డు విస్తరణ, పార్కింగ్ సదుపాయాల పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆయన సూచించారు. రోడ్డు నిర్మాణం, పార్కింగ్ అభివృద్ధి పనులు అత్యంత కీలకమైనవని, అన్ని విభాగాలు సమన్వయంతో వేగంగా, సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని



మాస్టర్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. తుడా సీపీఓ, టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు మాస్టర్ ప్లాన్ అమలు, రోడ్డు విస్తరణ, పార్కింగ్ ఏర్పాట్లపై సుదీర్ఘంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ శారదాదేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అదనపు ఎస్పీ రవి మనోహరచారి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, ఏడి సర్వేయర్ అరుణ్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, ఆర్ అండ్ బి ఎస్ ఈ సుధాకర్ నాయక్, తుడా ఎస్ ఈ రవీంద్ర, తుడా సీపీఓ దేవి, టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎకరాకు కోటి రూపాయలు పరిహారం చెల్లిస్తే భూములు ఇస్తాం

**- జాయింట్ కలెక్టర్,ఆర్డీవోకు స్పష్టం చేసిన రైతులు**

**సత్యవేడు – ఆంధ్రనాడు, మే 15:** సన్న చిన్నకార రైతులకు భూములే ఆధారం. తరతరాలుగా వీటి ద్వారానే జీవనం కొనసాగిస్తున్నారు. అయితే పరిశ్రమలు ఏర్పాటుకుగాను భూసేకరణ ప్రక్రియలో ఎకరాకు కోటి రూపాయలు పరిహారంగా చెల్లించి భూములు తీసుకోవచ్చని సత్యవేడు మండలం ఇరుగుళం రైతు సుశీల్ కుమార్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. భూసేకరణ, పరిహారం తదితర అంశాలపై శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు అధ్యక్షతన, సులూరుపేట ఆర్డీవో దేవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో తహసిల్దార్ శివప్రసాద్ పర్యవేక్షణలో ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాకం తదితర గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఏపీఐఐసీకి భూములు ఇచ్చే విషయంలో పలువురు రైతులు వారి అభిప్రాయాలను అధికారులకు విన్నవించారు. ఈ ప్రాంతంలో భూముల విలువ పెరిగినందున భూ పరిహారం నిర్ధారణ విషయంలో రైతులకు న్యాయం జరిగేటట్టు చూడాలని కొల్లడం రైతు నిరంజన్ రెడ్డి విన్నవించారు. భూ సేకరణ చట్టాన్ని పరిగణలోకి తీసుకొని పరిహారం చెల్లించాలి తప్ప, అరకొర పరిహారం చెల్లించి భూములు లాక్కోవాలనుకుంటే రైతులకు ఆమోదయోగ్యం కాదన్నారు. ఒకవేళ పోలీస్ బందోబస్తుతో బలవంతపు భూసేకరణ ద్వారా భూములు తీసుకోండి అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల పాటు తాను సాగు చేసిన మామిడి చెట్లను దౌర్జన్యపూరితంగా రంపాలతో నరికి తీసుకెళ్లిన వైనాన్ని మరో రైతు శ్రీరామచంద్రారెడ్డి జాయింట్ కలెక్టర్ గోవిందరావుకు వివరించారు. అంతకు మునుపు ఆర్డీవో దేవేందర్ రెడ్డి భూ విలువ, పరిహారం విషయాన్ని రైతులకు వివరించారు. కొల్లడంలో ఎనిమిది లక్షల 25 వేల రూపాయలు బేసిక్ భూముల విలువ ఉందన్నారు. ఇరుగులంలో 9లక్షల 52 వేల రూపాయలు బేసిక్ భూముల విలువ ఉన్నట్టు పేర్కొన్నారు. అయితే దీనిపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. భూరిజిస్ట్రేషన్పై ఉన్న నిషేధం కారణంగా గత 15 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో భూరిజిస్ట్రేషన్ జరగలేదని రైతు బాలసుందరం రెడ్డి పేర్కొన్నారు. అయితే ఆర్డిఓ దేవేంద్ర రెడ్డి కల్పించుకొని 22 ఏ లో ఉన్న నిషేధిత భూములు తప్ప మిగతా భూములు రిజిస్ట్రేషన్కు అభ్యంతరం లేదన్నారు. సంబంధిత రెవెన్యూ, సబ్ రిజిస్టర్ వ్యవహారించిన తీరు వల్లే భూరిజిస్ట్రేషన్ జరగకపోవడంతో అధికారికంగా భూముల విలువ పెరగలేదన్నారు. పైగా ప్రస్తుతం ఒక ఎకరా భూమి ఒక కోటి రూపాయలు పైనే ధర పలుకుతున్నట్టు రైతు సుశీల్ కుమార్ రెడ్డి అధికారులకు విన్న



వించారు. పైగా క్షేత్రస్థాయిలో పర్యటించి భూముల విలువ ఏ మేరకు ఉందో స్వయంగా అంచనా వేయాలని కోరారు. అంతే తప్ప బేసిక్ భూముల విలువను ప్రాతిపదిగా తీసుకొని పరిహారం నిర్ణయిస్తే రైతులకు ఎవరికి ఆమోదయోగ్యం కాదన్నారు. భూరిజిస్ట్రేషన్ లేకపోవడం వల్ల కనీసం రైతులకు బ్యాంకర్లు రుణాలు కూడా మంజూరు చేయలేదని రైతు ప్రవీణ్ కుమార్ రెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. కనీసం రైతులకు వన్ బి కూడా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. 2007లో ఒక్కో మామిడి చెట్టుకు 6000 రూపాయలు చెల్లిస్తే ప్రస్తుతం 5800 నిర్ణయించడం రైతులకు న్యాయం జరిగినట్టైనా అంటూ రైతు నిరంజన్ రెడ్డి అధికారులకు విన్నవించారు. భూసేకరణ ప్రక్రియలో పూర్వపు ఆర్డీవోగా పనిచేస్తున్న కిరణ్మయి కనీసం రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించినట్టు రైతులు ఆరోపించారు. పైగా ఇప్పటికే డ్రాఫ్ట్ డిక్లరేషన్ ఇచ్చే ముందుకు సాగడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జాయింట్ కలెక్టర్కు రైతులు వినతిపత్రం సమర్పించారు. తదనంతరం జాయింట్ కలెక్టర్ గోవిందరావు మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్ట ప్రకారం భూములు అవసరం అవుతుందని ఏపీఐఐసీ కోరడంతో ఆ మేరకు చర్యలు తీసుకున్నామన్నారు. అయితే ఇక్కడ పరిశ్రమలు కూడా రావాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా ఉపాధి పెరగడంతో పాటు ఆదాయ వనరులు కూడా పెరుగుతుంది అన్నారు. రైతులు వారి భూములను కోల్పోవడం బాధాకరమే అయిన అదే సమయంలో పారిశ్రామీకరణ కోసం భూములు తప్పని సరి అన్నారు. భూపరిహార నిర్ధారణలో రైతులకు న్యాయం జరిగేలా తమ పరిధిలో ఏం చేయాలో చేస్తామన్నారు. ఇదేగాక రైతులు చెప్పిన అన్ని అంశాలను పరిగణలో తీసుకుని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ విషయంలో రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన పని లేదు అన్నారు. ఆర్డీవో దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ పరిహారం నిర్ధారణలో బేసిక్ భూముల విలువకు 15 శాతం అధికం చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఎకరాకు 23 లక్షలు పరిహారంగా అందుతుందన్నారు. ఇంకా జాయింట్ కలెక్టర్ పరిధిలో కూడా పెరుగుతుందన్నారు. పరిహార విషయంలో 35 శాతం వరకు కూడా పెంచి తుది నిర్ణయం ప్రభుత్వం కూడా తీసుకోవచ్చు అని అన్నారు. ప్రైవేటు స్థలాల్లో ఇండ్లు నిర్మించి అవి సమీప పంచాయతీ పరిదిలోకి వస్తుంటే దీన్ని భూసేకరణ నుంచి మినహాయింపు ఇస్తామన్నారు. ఏది ఏమైనా ఎకరాకు కోటి రూపాయలు చెల్లించి భూములు తీసుకోవాలని రైతులందరూ ముక్తకంఠంతో అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎస్సై సాయినాథ్ చౌదరి, భూసర్వే డీటీ త్యాగరాజు, ఆర్ ఐ నరేంద్ర రెడ్డి, వీఆర్వో విక్రాంత్, రైతులు పామాంజి రాజేష్, విజయ శంకర్ రెడ్డి, కాశీ ప్రతాపరెడ్డి, మహేష్ రెడ్డి, రవి రెడ్డి, చంద్రారెడ్డి, మునికుమార్‌రెడ్డి, జయశంకర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



# ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించండి



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 15 :** రేణిగుంట మండలం కరకంబాడి అమరరాజ కర్మాగారం సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను ప్రారంభించాలని సిపిఐ పార్టీ నాయకుడు వైయస్ .మనీ డిమాండ్ చేశారు. రేణిగుంట సిఐటియు మండల కన్వీనర్ సెల్వరాజు మాట్లాడుతూ తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి అమరాజా ఫ్యాక్టరీ దగ్గర ఏర్పాటు చేసిన ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు గత, 8 సంవత్సరాలగా పెండింగ్లోనే ఉంది కొట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అవుతున్న పట్టించుకోని అధికారులు అని విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వం హయంలో గల్లా అరుణ్ కుమారి మంత్రిగా ఉన్నప్పుడు ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించారు. ఆ తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు పూర్తిగా ఆగిపోయినాయి. ఇప్పటికీ 8 సంవత్సరాలుగా ఈ ఫ్లై ఓవర్ అభివృద్ధికి నోచుకోలేక ఉంది, ఇప్పుడు తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అయినా ఈ బ్రిడ్జి పనులు పూర్తి చేసి ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సిఐటియు రేణిగుంట మండల కన్వీనర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి దగ్గర అన్ని రాజకీయ పార్టీల్ని కలుపుకొని అన్ని ట్రేడ్ యూనియన్, సంఘాలు ప్రజా సంఘాలన్నీ కూడా కలిపి ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రజాధనాన్ని వృధా చేయకండి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తారకరామా నగర్ అభివృద్ధి సంఘం కార్యదర్శి రాజశేఖర్, కరకంబాడి పంచాయతీ, సిపిఎం పార్టీ, కార్యదర్శి సత్య శ్రీ ఈ ప్రకటనలో తెలియజేశారు.

# బంగారు తిరుచ్చిపై అమ్మవారి అభయం



**తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, మే 15:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చి పై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. శుక్రవారంలో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేలుకొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవర్లను వేంచేపుగా ఉద్యానవనానికి తీసుకెళ్లి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని శోభాయమానంగా అలంకరించిన వైభవంగా ఉంజల సేవ నిర్వహించారు. అనంతరం బంగారు తిరుచ్చిపై కొలువు దీర్చి తిరుమాడా వీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కర్పూర నీరాజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఆలయ ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్లు రమేష్, సురేష్, మునిచంగల్రాయులు ఇన్స్పెక్టర్లు ప్రసాద్, చలపతి ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# జాతరకు సిద్ధమవుతున్న అమ్మవారి ప్రతిమలు...



**కుప్పం – ఆంధ్రనాడు, మే 14:** కుప్పం గ్రామదేవత శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా సోమవారం నిర్వహించనున్న అగ్నిగుండ ప్రవేశం, మంగళవారం అమ్మవారి శిరస్సు ఊరేగింపు, బుధవారం విశ్వరూప దర్శనానికి అమ్మవారి ప్రతిమలను పూజారులు సిద్ధం చేస్తున్నారు. ఆలయం వెనుక భాగంలో శ్రీ ప్రసన్న ముత్తుమారమ్మ, శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ శిరస్సులకు రంగులది, కళ్ళు చిత్రించి భక్తులకు అమ్మవారి కరుణ కలిగించేలా ముందస్తు పూజలు నిర్వహించి జాతరకు సిద్ధం చేస్తున్నారు. ఏడాదికి ఒక్కరోజు మాత్రమే లభించే అమ్మవారి విశ్వరూప దర్శనానికి లక్షల మంది అమ్మవారి భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో సాంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించి, ప్రతిమలు సిద్ధం చేస్తున్నారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ "గంగమ్మ తల్లి మా గ్రామ రక్షక దేవత. ప్రతి ఏడాది కళాకారులు ఎంతో భక్తితో అమ్మవారికి రంగులు అద్దుతారు. ఈ కళలు మా సంస్కృతికి ప్రతీక" అని తెలిపారు.

# యువతకు ఫుట్బాల్ శిక్షణ ప్రారంభం



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 15:** రేణిగుంట మండలం జీవాగ్రామ్ మైదానంలో శుక్రవారం 17 వ .జె ,ఎఫ్ ,ఏ, ఫుట్బాల్ అసోసియన్ ఆధ్వర్యంలో, ఉచిత కోచింగ్, క్యాంప్ ప్రా రంభించారు. పి, ఎం హై స్కూల్ గ్రౌండ్స్ లో 17 వ ఫ్రీ ఫుట్బాల్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం, 16 సంవత్సరాలుగా జే, ఎఫ్,ఏ ఫుట్ బాల్ అసోసియేషన్ నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 2026 శుక్రవారం రోజు నుండి ప్రారంభమై 30వ తారీకు వరకు, పిల్లలకు ఉచితముగా కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. గత సంవత్సరం 120 మంది హాజరు కాగా ఈ సంవత్సరం 150 దాటుతుందని అంచనా, ముఖ్య అతిథులుగా లోకల్ పాస్టర్ డాక్టర్ కేపీ లూథర్ బాబు, ఎస్సై హరీష, చైర్మన్ కె.పి జయకర్, యేసురత్నం,రెవరెండ్ సతీష్, రెవరెండ్ దీపక్,రెవరెండ్ నోవా, డాక్టర్ సుధాకర్,ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్, హెడ్ కానిస్టేబుల్ ఉమా, తిరుపతి కోచ్ రమేష్, ఎక్స్ఆర్మీ రాజకుమార్, రమేష్, సీనియర్ కోచ్ దీన దయాకర్, సీనియర్ ఫుట్బాల్ ప్లేయర్ శేఖర్ పరమానందం, కెపి దివాకర్, శ్రీరాజ్, శ్రీపతి, సుమన్ స్వామి దాస్, నిఖిల్ సన్నీ, కోచ్ నవీన్ , పిడి సతీష్ బాబు,వీ నవీన్, ఇ భవేష్, లాంబర్ట్ మధుకర్, పాల్గొన్నారు పిల్లలకు ప్రతిరోజు పాలు, గుడ్డు, అరటిపండు, రోజు పౌష్టికాహారం అందించనున్నారు. గాజులమండ్యం పోలీస్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో కోడిగుడ్లు ప్రతి సంవత్సరం అందజేస్తున్నందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు,17వ సంవత్సరం జరుపుతున్నందుకు జే,ఏఫ్,ఏ సభ్యులందరూ సంతోషం వ్యక్తం చేశారు. పిల్లలను పంపిస్తున్న తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు, అమ్మ గుంట ఫౌండేషన్ వారు 150 జెర్సీలను పిల్లలకు ఫ్రీగఅందజేశారు. ఈ సమ్మర్ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఉదయం 5:30 గంటల 7:30 సాయంత్రం 5 గంటల నుండి 6:30 వరకు సమ్మర్,ఫ్రీ ఫుట్బాల్ కోచింగ్ క్యాంపు నిర్వహించబడుతుందని, తెలిపారు. ఈ సందర్భంగా, అమ్మ చారిటబుల్ ట్రస్ట్, మరియు ప్రతి సంవత్సరం విరాళాల దాత పిల్లపాలెం మోహన్ రెడ్డికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఘనంగా అన్నదానం...







**కుప్పం – ఆంధ్రనాడు, మే 14:** కుప్పం గ్రామదేవత శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా శుక్రవారం అన్నదానం, సుమంగళి వ్రతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయం వరకు భారీ ఎత్తున మహిళలు ర్యాలీ చేపట్టారు. ఆలయంలో శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ, తిరుపతి గంగమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మహిళలకు పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తరపున భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి సాంప్రదాయబద్ధంగా కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ పీ.ఎస్ మునిరత్నం, తితిదే పాలకవర్గ సభ్యుడు శాంతారామ్, ఆలయ కమిటీ చైర్మన్ రవిచంద్రబాబు పూజలు చేపట్టి, ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని జరిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ రవిచంద్రబాబు, సభ్యులు, కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, నాయకులు రాజ్ కుమార్, ప్రతాప్ కుమార్, గోపీనాథ్, కడ అభివృద్ధి కమిటీ మెంబర్ సతీష్ కుమార్, కౌన్సిలర్లు దాము, సోము, సురేష్, తదితరులు ఉన్నారు..

# సకాలంలో పౌష్టికాహారం పంపిణీ చేయాలి - సీడీపీఓ సుజాత

**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 15:** అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం అం దజేయాలని సీడీపీఓ సుజాత అన్నారు.శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో తంబళ్లపల్లి, పెద్దమండ్యం, కురబలకోట అంగన్వాడీ కార్యకర్తలతో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో లబ్దిదారు లందరిని సమావేశ పరచి ఐవీఆర్ఎస్ కాల్స్ పైన అవగాహన కల్పించాలన్నారు.



పిల్లలకు మెనూ మేరకు భోజ నం అందించాలని, బాలింతలు, గర్భిణులకు సకాలంలో సకాలంలో పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. ప్రతి మంగళ, శుక్ర వారాలు విధిగా కిశోరి వికాసం కా ర్యక్రమం నిర్వహించడంతో పాటు 11ఏళ్ల నుంచి 18ఏళ్ల లోపు బాల బాలికలను కిశోరి వికాసం కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు రమణమ్మ, చంద్ర కాంత, నౌజియా బేగం, నాగలక్ష్మి, ప్రభావతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో భూ ఆక్రమణలపై వైసిపి నేతల పిర్యాదు

**శాంతిపురం– ఆంధ్రనాడు,మే15:** మండల పరిధిలోని పలు అసైన్డ్, ప్రభుత్వ,దేవాదాయ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, ప్రభుత్వ భూములను కాపాడాలని రెవెన్యూ అధికారులకు మండల వైసిపి నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో మండల వైకాపా నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ మండలంలోని గుండిశెట్టిపల్లి రెవెన్యూ గ్రామం పరిధిలో హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ మఠం వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం 2006లో భూములు కొనుగోలు చేసిందన్నారు. 28 గుండిశెట్టిపల్లి రెవెన్యూ పరిధిలో 36.99 ఎకరాలు, మఠం శాంతంపల్లి రెవెన్యూ పరిధిలో 3.35 ఎకరాల పట్టా భూములను కొన్నారు. ఈ భూముల మద్య, పక్కన ఉన్న దాదాపు 13 ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ, దేవాదాయ భూములను కూడా ఆ సంస్థ కొనుగోలు చేసినట్టు అప్పట్లో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈ వ్యవహారం పై 2006లోనే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం దీనిపై విచారణకు అదేశించటంతో అధికారులు అక్రమాలను నిగ్గు తేల్చారు. అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి రెవెన్యూ రికార్డులలో ప్రభుత్వ భూమిగా మార్చారు. అప్పటి నుంచి హెరిటేజ్ సంస్థ ఆయా భూములను వాడుకోక వదిలేసిందన్నారు. తర్వాత 2018లో హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ మఠం వద్ద ఉన్న తన ప్యాక్ హౌసు, మొత్తం 40.34 ఎకరాల పట్టా భూములను ఫ్యూచర్ రీటైల్ లిమిటెడ్ సంస్థకు విక్రయించిందని తెలిపారు.ఆ సంస్థ నుంచి మరొకరికి చేతులు మారి, 2026 మార్చిలో కొందరు ఈ భూమిని కొనుగోలు చేశారు. కొత్తగా కొనుగోలు చేసిన వారు గుండిశెట్టిపల్లి రెవెన్యూకు సంబందించిన దాదాపు 13 ఎకరాల అసైన్డ్, అనాధీనం, దేవాదాయ భూములను కూడా తమ భూమిలో కలిపేసుకున్నారు అని ప్రభుత్వం నిషేదిత జాబితా(22ఏ) లో ఉంచిన భూములను కూడా దర్జాగా కబ్జా చేశారన్నారు. పలమనేరు కుప్పం జాతీయ రహదారికి సమీపంలోని సుమారు 13 ఎకరాల ఈ భూముల విలువ రూ 30 కోట్లకు పైగా ఉంటుంది, ఇంత విలువైన ప్రజా ఆస్థిని ప్రభుత్వ, ప్రజా అవసరాల కోసం పరిరక్షించాల్సి ఉందని తెలిపారు. బాద్యత గల విపక్షంగా ఈ కబ్జా వ్యవహారాన్ని వెలుగులోకి తెస్తున్నామన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, కడా పిడి, రెవెన్యూ డివిజన్ అధికారి, తహశిల్దారులకు పిర్యాదులను పంపాము అని వైసిపి నాయకులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణకు అన్ని రాజకీ పార్టీలు కలిసివస్తాయని, ప్రభుత్వ యంత్రాంగం చట్టబద్దంగా చర్యలు తీసుకొంటుందని ఆశిస్తున్నాము అని అలా కాని పక్షంలో చట్ట, న్యాయ వ్యవస్థల ద్వారా దీనిపై పోరాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు బుల్లెట్ దండపాణి, ఎంపీపీ వసుంధర కోదండ రెడ్డి, నాయకులు చక్రపాణి రెడ్డి, కృష్ణమూర్తి, ఏవి జయరాం, మురలీమోహన్ రెడ్డి, సోమరామి రెడ్డి, నాదమణి, శ్రీరాములు, ప్రభాకర్ రెడ్డి ,విజయ్ కుమార్, లోకేష్, చలపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపే లక్ష్యం

శాంతిపురం – ఆంధ్రనాడు, మే 15: రాష్ట్ర ప్రభుత్వం నీటి సంరక్షణ, భూ గర్భ జలాల పెంపే లక్ష్యంగా జలధార పథకాన్ని అమలు చేస్తున్నదని ఎంపీడీఓ ఏ పి ఆర్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని రాళ్ళబూదుగూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రామేగానిపల్లె గ్రామంలో జరుతున్న జలధార పథకము పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సంధర్భముగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలధార పథకములో భాగంగా మండలములో 43 పనులను గుర్తించామని వీటికి గాను 18 పనులు ప్రారంభము కాబడి, వివిధ దశలలో పనులు జరుగుచున్నాయని తెలిపారు. ఈ సంరక్షణ పనుల ద్వారా నీరు సంవృద్ధిగా నిల్వకు అవకాశము ఏర్పడి, భూగర్భ జలాలు పెంపొందుతాయని తెలిపారు ఈ పరిశీలనలో పంచాయతీ అభివృద్ధి అధికారి శివ శంకరయ్య, ఇంజనీరింగ్ సహాయకులు హరికృష్ణ పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## శేష వాహనాలపై అమ్మవారి ఉత్సవ ఊరేగింపు..



**కుప్పం రూరల్ – ఆంధ్రనాడు, మే 14:** కుప్పం గ్రామదేవత శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి, మధ్యాహ్నా భక్తులకు అన్నదానం చేపట్టారు. రాత్రి రెండు శేష వాహనాలపై శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ ఉత్సవాలను అలంకరించి ఆలయ సరిహద్దుల వరకు ఊరేగించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

## శ్రీ సిటీలో జపాన్ ఉద్యోగాలకు యువతకు శిక్ష




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 15 :** తిరుపతి జిల్లా శ్రీ సిటీలో జపాన్ దేశంలో ఉద్యోగ అవకాశాల కోసం అర్హులైన యువతి యువకులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యానుఫ్యాక్చరింగ్, క్యార్గివింగ్, కన్స్ట్రక్షన్, హాస్పిటాలిటీ, ఆటోమొబైల్ తది తర రంగాల్లో జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించబడనున్నాయి. 18 నుండి 30 సంవత్సరాల వయస్సు గల, 10వ తరగతి నుండి డిగ్రీ వరకు అర్హత కలిగిన అభ్యర్థు లు దరఖాస్తు చేసుకోవచ్చని, శిక్షణ అనంతరం ఎంపికైన వారికి నెలకు రూ. 1,03,996 నుండి రూ.1,45,000 వరకు వేతనం లభించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ప్రాథమిక ఇంగ్లీష్ కమ్యూనికేషన్ నైపుణ్యాలతో పాటు అవసరమైన ధృవపత్రాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ చివరి తేదీ 31-05-2026 కాగా, మొత్తం ఫీజు రూ.2,లక్షలు (ట్రైనింగ్, ప్లేస్మెంట్ సపోర్ట్ చార్జెస్ సహా)గా నిర్ణయించారు. అర్హులకు ఎడ్యుకేషన్ లోన్ సదుపాయం కూడా లభిస్తుందని, మరిన్ని వివరాలకు https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్ లేదా 91609 12690, 99888 53335 నంబర్లను సంప్రదించవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం పేర్కొన్నారు.

## జనగణన పనులు వేగవంతం చేయాలి
## - జాయింట్ కలెక్టర్ గోవిందరావు



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 15:** జనగణన కార్యక్రమాన్ని నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు అధికారులను ఆదేశించారు. జనగణన పురోగతి మందగించిన నేపథ్యంలో శుక్రవారం ఆయన ఆర్డీఓ దేవేందర్ రెడ్డితో కలిసి సూళ్లూరుపేట మండలాన్ని సందర్శించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సెన్సస్ ఎన్యుమరేషన్ ప్రక్రియ, ఎన్యుమరేటర్ల పనితీరు, హెచ్‌ఎల్‌బీల వారీగా నమోదుల స్థితిని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులపై సమీక్ష చేపట్టి పెండింగ్ నమోదులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లతో సమావేశమైన జాయింట్ కలెక్టర్, జనగణన దేశ ప్రణాళికా అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుచానూరులో నిషేధిత పొగాకు ఉత్పత్తులపై పోలీసుల దాడులు




**తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, మే 15:** తిరుచానూరులో నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. తిరుచానూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) బి.సునీల్ కుమార్ నేతృత్వంలో ఎస్ఐ సుధాకర్, పోలీసు బృందం పలు దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో విక్రయిస్తున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులను గుర్తించి దాడులు చేపట్టారు. తనిఖీల్లో కొన్ని పొగాకు ఉత్పత్తుల ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిషేధిత ఉత్పత్తుల విక్రయాలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే ఉత్పత్తులపై ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని సిఐ సునీల్ కుమార్ తెలిపారు.

## సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ప్రజాసంఘాలలో చేరిన సత్యవేడు నియోజకవర్గ సిపిఎం మాజీ నేతలు

**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 15:** నాగలాపురం మండలం మాజీ సిపిఎం నేతలు శుక్రవారం సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ప్రజాసంఘమైన ఏఐకేఎంఎస్, ఐఎఫ్టియులో చేరారు. నారాయణపురంలోని ఐఎఫ్టియు కార్యాలయంలో ఏ.ఐ.కె.ఎమ్.ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి. వెంకటరత్నం పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఎం సీనియర్ నాయకుడుగా ఉన్న అరుణాచలం, నాగలాపురం మండల కార్యదర్శిగా పనిచేసిన మురుగేషన్ తో పాటు దినమణి, పద్మ, దక్షిణామూర్తి, డి.మురుగన్ ఉన్నారు. ఈ సందర్భంగా ఏపీరైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు పి.వెంకటరత్నం మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో అనేక భూ సమస్యలు ఉన్నాయని, కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని, రైతులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అరుణాచలం మాట్లాడుతూ 20 ఏళ్లుగా తాను సిపిఎం పార్టీలో వివిధ స్థాయిలో పని చేశానని, నేడు ఆ పార్టీలో సిద్ధాంతాలను పక్కన పెట్టి వ్యక్తి పూజ ఎక్కువైందని ఆరోపించారు. ఈనేపథ్యంలో తామంతా సిపిఐ న్యూడెమోక్రసీ పార్టీ అనుబంధ ప్రజా సంఘాలలో చేరి పనిచేయాలని నిర్ణయించుకున్నామన్నారు.




## ఓటర్ల జాబితాపై ప్రత్యేక కసరత్తు

- జూన్ 15 నుంచి బీఎల్ఓల ఇంటింటి యాత్ర
- సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 15:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) మూడో దశ కార్యక్రమంలో భాగంగా 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రత్యేక సవరణ చేపట్టాలని భారత ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తిరుపతి జిల్లాలో కూడా ప్రత్యేక సవరణ కార్యక్రమ షెడ్యూల్ ఖరారైనట్లు వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 5 నుంచి 14 వరకు సన్నాహాలు, శిక్షణ, ముద్రణ కార్యక్రమాలు నిర్వహించనుండగా, జూన్ 15 నుంచి జూలై 14 వరకు బిఎల్ఓలు ఇంటింటి పర్యటనలు చేపట్టనున్నారు. జూలై 21న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయనుండగా, జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు దావాలు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, ఓటర్లు అందరూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



## జాతరో జాతర.... గంగమ్మ జాతర...

- కనులకు విందుగా గంగమ్మ విశ్వరూప దర్శనం
- సుమారు లక్ష మంది వరకు దర్శించుకొన్నట్లు అంచనా

**పలమనేరు, ఆంధ్రానాడు, మే 15:** జాతరో జాతర...గంగమ్మ జాతర...అన్న భక్తి పాటల రీతిన గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం పగలు, రాత్రి పట్టణంలో భక్తులతో కిటకిటలాడుతూ కొనసాగింది. పట్టణ గ్రామ దేవతగా కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పిలువ బడే శ్రీ తిరుపతి గంగమ్మ జాతర మహోత్సవాలలో భాగంగా శుక్రవారం వేకువ జామున అమ్మవారి శిరస్సు ఊరేగింపు ముగిసి ఆలయం వద్ద ఉదయం నుంచి అమ్మ వారు విశ్వరూప దర్శనంతో భక్తులకు కనువిందు చేశారు.

**ఆనవాయితీగా**

పట్టణ మందలి పాతపేట శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం ఎదుట నుంచి ఈ శిరస్సు మెరవని కొనసాగింది. విశేషంగా మొక్కు బడులు తీర్చుకొనేవారు వేలాది టెంకాయలు కొట్టారు. ఓ వైపున రాత్రి సమయంలో జాతర సందర్భంగా పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ప్రత్యేక విద్యుత్ కాంతులతో అమ్మవారి రూపంలో వెలిగిపోతున్నది. భక్తుల సౌకర్యార్థం అమ్మవారి ఆలయం ఎదుట పది రోజుల క్రితం చలువ పందిళ్ళు వేసి సిద్ధం చేసారు. వేలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేందుకు ఉత్సవ కమిటీతో పాటు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతూ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా స్థానిక డిఎస్పీ డేగల ప్రభాకర్ పర్యవేక్షణతోపాటు డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐల ఆద్వర్యంలో పట్టణంలో గట్టి భద్రతా చర్యలు తీసుకొన్నారు. ఈ సందర్భంగా తమిళనాడు, కర్ణాటక ప్రాంతం నుంచి కూడా అమ్మవారి భక్తులు విశేష సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి సుమారు లక్ష మంది భక్తులు అమ్మవారిని ధర్శించు కొన్నట్లు అంచనా.



**విరివిగా అన్నదాన ప్రసాద వితరణలు**

అమ్మవారి ఆలయం వెళ్ళే గంగమ్మ గుడి దారిలో పలు కుల సంఘాలు విరివిగా శుక్రవారం ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. గాశీడ్ల సంక్షేమ సేవా సంఘం, ఆర్య వైశ్య, బలిజ సంఘం, వన్నెకుల క్షత్రియ తదితర కుల సంఘాలు ఈ అన్నదాన, ప్రసాద వితరణలు భారీ ఎత్తున ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు కొనసాగించారు. కాగా గంగమ్మ తోపులో పిల్లలకు ఆహ్లాదకరంగా అలరించేందుకు పలు వినోదా భరితమైన కార్యక్రమాలు వెలిశాయి.

**అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు**

గంగమ్మ అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్న ప్రముఖులలో స్థానిక శాసనసభ్యులు ఎన్. అమర్ నాథరెడ్డి సతీమణి రేణుకా రెడ్డితో పాటు పలువురు ముక్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్ నాయుడు, కమిటీ సభ్యులు అమ్మవారి దర్శనం చేపించి ఆలయం తరపున సత్కరించారు.

## నిలువెత్తు అలంకరణతో దర్శనమిస్తున్న సత్య గంగమ్మ

**పలమనేరు, ఆంధ్రనాడు, మే 15 :** స్థానిక పాతపేట తాలూకా కచేరి వీధిలో కొలువైవున్న సత్య గంగమ్మ కొంగుబంగారమై విరాజిల్లుతుంది.ఆలయంలో అమ్మవారు నిలువెత్తు అలంకరణతో భక్తులకు దర్శన మిస్తున్నది. పట్టణంలో గంగజాతర జరుగుతున్న వేళ ఇక్కడి అమ్మవారికి నూతనంగా పెయింటింగ్ పనులు చేపట్టి అత్యంత శోభతో కనిపించేలా చేశారు. దీనికి తోడు ఆలయ నిర్వాహకులు మీనాక్షి నాగరాజు నిత్యం వివిధ రంగుల ప్రత్యేక పూల దండలతో అలంకరించడంతో అమ్మవారు భక్తులకు అత్యంత భక్తిని చాటుకునేలా చూడముచ్చటగా దర్శనం ఇస్తున్నారు.



**నమ్మిన వారికి కొంగుబంగారంగా**

సత్య గంగమ్మ అమ్మవారిని నిత్యం కొలిచేభక్తులు పదులు సంఖ్యలో ఉన్నారంటే విశేషమే మరి.ముఖ్యమైన పనులకు, కార్యాలయానికి, వ్యాపారం, బయటి ప్రాంతాలకి వెళ్లి వచ్చేవారు ఇలా ఈ ఆలయం పరిసరాలలోని వారు నిత్యం అమ్మవారిని కొలిచేభక్తులు సుమారు 200 మందికి పైన ఉన్నారని చెప్పవచ్చును.ఆలయం చాలా చిన్నదైనా నమ్మి కొలిచే భక్తులకు ఇక్కడి అమ్మవారు ఓ నిజమైన శక్తి స్వరూపిణిగా ఉన్నారంటే ఆశ్చర్యమే. మంగళ, శుక్ర వారాలలో ప్రత్యేక పూజలు అలంకరణలు వుంటున్నాయి.

## గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతర ప్రసాద వితరణ



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 15:** పట్టణ గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ జాతర సందర్భంగా శుక్రవారం పగలు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిపారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమం జరుగగా మొదట అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రసాద వితరణ కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ ఆర్.రాజేంద్రన్ చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు చక్కెర పొంగలి, పులిహోర, చిత్రాన్నం, గీ రైస్, వెజిటబుల్ రైస్, వాటర్ ప్యాకెట్ లు వంటి ప్రసాద రకాలను ఉదయం 9.00గంటలు నుంచి సాయంత్రం 5.00 గంటలు వరకూ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఆర్.రాజేంద్రన్,చంద్ర అనే బాలకృష్ణ, టి.కె.షణ్ముగం, ఆర్.బీ.సీ. అమరేంద్ర బాబులు మాట్లాడుతూ గత రెండున్నర దశాబ్దాలుగా ఏటా జాతర రోజు పగలు గాండ్ల సంక్షేమ సేవా సంఘం పేరిట ఈ ప్రసాద వితరణ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ ప్రాంతం నుంచి వచ్చే భక్తులే గాక తమిళ నాడు, కర్ణాటక ప్రాంతం నుంచి వస్తున్న భక్తులు కూడా మా ప్రసాద వితరణకు తోడ్పాటు అందిస్తూ ప్రసాదశీ స్వీకరించి నాణ్యత రుచి చాలా బాగుందని చెప్పడం తమకు ఎంతో ఆనందం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎ. ఆర్. కుమార్, కోదండరామయ్య, ధ కోటిశెట్టి, గణేష్, శ్రీనాథ్, వెంకటరమణప్ప, సురేష్, మూర్తి, రాజేష్, బాబు, జగదీష్, ఉదయ్, శరవణ, శంకర్, బాలు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లాకు జాతీయస్థాయిలో రెండు అవార్డులు

**- కలెక్టర్‌ను అభినందించిన ముఖ్యమంత్రి**



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 15:** తిరుపతి జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో రెండు అవార్డులు సాధించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. శుక్రవారం అమరావతి నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి 'స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా మే నెల థీమ్ 'ప్లాస్టిక్ రహిత రాష్ట్రం' పై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం ప్రాధా న్యతను ఆయన వివరించారు. జిల్లాల వారీగా ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్లు, వి ద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, ప్రజా ప్రదేశాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగా న్ని పూర్తిగా తగ్గించేలా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజ ల్లో పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అనంత రం తిరుపతి జిల్లాకు పంచాయతీరాజ్ శాఖలో జాతీయస్థాయిలో రెండు అవార్డులు రావడంపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌ను ముఖ్యమంత్రి అభినందించారు.

# వెదురుకుప్పానికి వంద టన్నుల పశువుల దాన

**- పంపిణీని ప్రారంభించిన మోహన మురళి**

**- ఎమ్మెల్యే థామస్ కు కృతజ్ఞతలు తెలిపిన రైతులు**




**వెదురుకుప్పం, ఆంధ్రనాడు, మే 16:** వెదురుకుప్పం మండలం పాడి రైతాంగం కోసం మొదటి విడతలో 100 టన్నుల పశువుల దానా మంజూరు అయినట్టు అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సబ్సిడీలో పాడి రైతులకు పశువుల దానా పంపిణీ కార్యకమాన్ని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోహన మురళీ ప్రారంభించారు. పచ్చికాపలం వెటర్నరీ హాస్పిటల్ లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డా.వి.ఎం.థామస్ ఆదేశాల మేరకు సబ్సిడీ దానా పంపిణీ ప్రారంభించామని అధ్యక్షులు మోహన మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 100 టన్నుల దాన తెప్పించిన ఘనత ఎమ్మెల్యే తామస్ గారిదని కొనియాడారు. గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే చంద్రబాబు గారి పాలన రైతు పాలన అని చెప్పడానికి రైతులకు సబ్సిడీ ద్వారా 555 ఆదా చేయడమే  నిదర్శనమని తెలిపారు. మొత్తం ఖరీదు  – 1110 సబ్సిడీ 50% – 555/– రైతు వాట 555/– వెదురుకుప్పం మండలానికి 100 టన్నుల పశవుల దానాలను సప్లై చేస్తున్న కూటమి ప్రభుత్వం  నాలుగు కేంద్రాలలో ముఖ్యముగా దేవళంపేట, తిరుమలయ్యపలి, వెదురుకుప్పం, పచ్చికాపలంలో పంపిణీ ఉంటుందని తెలిపారు.  ఒక రేషన్ కార్డుకి ఒక 50 కేజీల బస్తా మాత్రమే ఇవ్వబడుతుందని , ఇది మొదటి విడత కింద పంపిణీ అని, తదుపరి కూడా రెండవ విడత పంపిణీ ఉంటుంది అని అధికారులు తెలిపారు. ఈ సందర్భముగా పలువురు రైతులు ఎమ్మెల్యే డా.వి.ఎం. థామస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్. గోవిందయ్య సహాయ సంచాలకులు డా. రూపుసుందరి, వెటర్నరీ డా.రాజేష్, పార్లమెంట్ కార్య నిర్వహక కార్యదర్శి చంగల్రాయిరెడ్డి క్లస్టర్ కన్వీనర్ రమణారెడ్డి యూనిట్ కన్వీనర్ కిరణ్ యాదవ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు జై రామ్ రెడ్డి శేషరెడ్డి పెద్ద ఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా పులి నరేంద్ర కుమార్ రెడ్డి



**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 15:** భారతీయ జనతా పార్టీ అన్నమయ్య జిల్లా నూతన అధ్యక్షుడిగా పులి నరేంద్ర కుమార్ రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పీవీన్  మాధవ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నరేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ తన కష్టాన్ని గుర్తించి జిల్లా అధ్యక్ష పదవి అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. రాజకీయ నేపథ్యం లేకపోయినా పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తలకు బీజేపీలో తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. తాను 1993లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌లో విద్యార్థి నాయకుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించానన్నారు. అనంతరం బీజేవైఎం ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, వాయల్పాడు అసెంబ్లీ ఇన్‌చార్జి, తంబళ్లపల్లి ఎన్నికల కోఆర్డినేటర్, మదనపల్లి మున్సిపల్ ఎన్నికల క్యాంపైనర్, పీలేరు అసెంబ్లీ కన్వీనర్‌గా వివిధ హోదాల్లో పనిచేసినట్లు తెలిపారు. అలాగే 2016 నుంచి 2020 వరకు చిత్తూరు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, 2020 నుంచి 2022 వరకు రాజంపేట పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 2022 నుంచి 2025 వరకు అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడిగా, అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మాజీ ముఖ్యమంత్రి నల్లారి  కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దయాకర్ రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, సీనియర్ నాయకుడు చల్లపల్లి నరసింహా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# కార్యకర్తలే తెదేపాకు బలం.. బలగం..

- అట్టహాసంగా చిత్తూరు నియోజకవర్గ మహానాడు
- తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు
- పదవుల కోసం కాదు.. పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు : ఎమ్మెల్యే గురజాల
- జాతీయ తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేష్ ఎంపికపై హర్షం.
- సమిష్టిగా ముందుకు సాగుదాం : జిల్లా అధ్యక్షుడు షణ్ముగం రెడ్డి



**చిత్తూరు, మే 15, ఆంధ్రనాడు:** చిత్తూరు నగరం పసుపు మయమైంది. చిత్తూరు "నియోజకవర్గ స్థాయి మహానాడు" కార్యక్రమం ఎమ్మెల్యే గురజాల మోహన్ అధ్యక్షతన అట్టహాసంగా జరిగింది. శుక్రవారం సంతపేటలోని జీజేఎం సుఖీభవ కళ్యాణమండపంలో పండుగ వాతావరణంలో.. కార్యకర్తల కోలాహలం మధ్య మహానాడు కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, తెదేపా జిల్లా అధ్యక్షుడు షణ్ముగం రెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్ తదితరులు జ్యోతి వెలిగించి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గ మహానాడు హాజరైనట్టు సంతకాలు చేశారు. కార్యక్రమం ప్రారంభంలో..  తెలుగుదేశం పార్టీ పుట్టక, మహానాడు ప్రస్థానం, దివంగత ముఖ్యమంత్రి, తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చరిత్ర, ప్రస్థానాన్ని వివరించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రసంగించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యవహరిస్తున్న గోళ్ల హేమాద్రి నాయుడుకు నారా లోకేష్ గారు పంపిన ప్రశంసా పత్రాన్ని అందించారు.

**30కి పైగా తీర్మానాలు..**

చిత్తూరు నియోజకవర్గస్థాయి మహానాడు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని వివిధ సమస్యలు, అంశాలపై పలు తీర్మానాలను ప్రస్తావించి ఏకగ్రీవంగా ఆమోదించారు. మొదటిగా తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్‌ని నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ తీర్మానించారు. మొత్తం 30కి పైగా తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ తీర్మానాల కాపీని ఎమ్మెల్యే ద్వారా జిల్లా మహానాడుకు పంపారు. కార్యక్రమంలో భాగంగా చిత్తూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల వీడియో ప్రదర్శన ఆకట్టుకుంది.

**మృతి చెందిన కార్యకర్తలకు సంతాపం..**

గడిచిన ఏడాది కాలంలో వివిధ కారణాలతో మరణించిన 115 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులకు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ.. అండగా ఉంటామన్నారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

**సమిష్టిగా స్థానిక సంస్థల ఎన్నికలకు..**

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని.. 44 వసంతాల తెలుగుదేశం పార్టీలో కార్యకర్తల అభిప్రాయాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు జిల్లా పార్టీ అధ్యక్షుడు షణ్ముగం రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ గారి సారథ్యంలో.. 2029, 2034 ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో పని చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైన నారా లోకేష్ గారికి పూర్తి మద్దతుగా నిలవాలని.. వారి మార్గనిర్దేశంలో పని చేస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి మీద నమ్మకంతో.. కూటమి పార్టీకి వెన్నంటి నిలిచిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గారికి ధన్యవాదాలు తెలిపారు.

**పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు..**

పార్టీ కోసం కష్టపడే వారికి తెలుగుదేశం పార్టీలో గుర్తింపు తప్పకుండా లభిస్తుందని.. ఇందుకు నేనే నిదర్శనమని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. తనపై నమ్మకంతో  ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు, నారా లోకేష్ గారు అనేక  సమీకరణాలు అడ్డుగా ఉన్నా.. అన్నింటిని పక్కనపెట్టి తనకు ఎమ్మెల్యే సీటు ఇచ్చారని.. చిత్తూరు ప్రజలు అదే నమ్మకంతో నన్ను అసెంబ్లీకి పంపించారని.. అలాంటి అవకాశం కల్పించిన వారికి ఎప్పుడు అండగా నిలుస్తానన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. పదవుల కోసం పని చేయకుండా.. పార్టీ కోసం పని చేస్తే తప్పకుండా పదవులు మీ చెంతకే వస్తాయని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలోని భాజపా, జనసేనతో కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ గా ఎన్నికైన నారా లోకేష్ గారి సారథ్యంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులంతా కలిసికట్టుగా పనిచేసి ప్రజల వద్దకు వెళ్లాలన్నారు. గత వైకాపా ప్రభుత్వం దౌర్జన్యాలతో ఎన్నికలు నిర్వహించారని, మనం గడిచిన రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి వారి మద్దతుతో విజయం సాధించాలన్నారు. కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పనిచేసి చిత్తూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నారు. ఈనెల 24వ తేదీన చిత్తూరు ఆర్ ఎల్ ఎన్ కళ్యాణ మండపంలో జరిగే జిల్లా స్థాయి మహానాడు కార్యక్రమాన్ని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు చంద్రప్రకాష్, అరుణ, సీకే లావణ్య, సురేంద్ర కుమార్, సాధు దిలీప్, ఝాన్సీ వెంకటేష్ యాదవ్, త్యాగరాజన్, కాజూరు బాలాజీ, వసంత కుమార్, అముద, సుబ్బానాయుడు, గోళ్ల హరి, రాజేష్ కుమార్ రెడ్డి, వైవీ రాజేశ్వరి, సీఎం విజయ, పీటర్, శశికర్ బాబు, రఘు, మోహన్ రాజ్, నరేష్, అత్తు భాయ్,  చిత్తూరు రూరల్, గుడిపాల మండల, చిత్తూరు నగర ప్రధాన కమిటీ సభ్యులు, నియోజకవర్గం మహిళా, రైతు, బీసీ, వాణిజ్య, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఐ–టిడిపి కమిటీ సభ్యులు, క్లస్టర్, డివిజన్, బూత్ ఇన్చార్జులు, గ్రామ కమిటీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు

**బీజేపీ అసలు రంగు బయటపడింది : కాంగ్రెస్ నేత రెడ్డి సాహెబ్**



**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 15:** ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యాయో లేదో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన అసలు రంగును బయటపెట్టిందని మదనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.రెడ్డి సాహెబ్ విమర్శించారు. పెట్రోల్‌పై రూ.3.14, డీజిల్‌పై రూ.3.11 చొప్పున ధరలు పెంచి ప్రజలపై మరోసారి భారం మోపిందని ఆరోపించారు. ఇది బీజేపీ చేతగాని పాలనకు, ఆర్థిక దివాళా కోరుతనానికి నిదర్శనమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు సామాన్యులు, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు 10 పొదుపు సూత్రాలు సూచించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. దేశ చరిత్రలో ఇంతవరకు ఏ ప్రధానమంత్రి కూడా ప్రజలకు ఇలాంటి సూచనలు చేయలేదని, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వ ఆర్థిక వైఫల్యాల వల్లే ఇలాంటి పరిస్థితులు వచ్చాయని అన్నారు. పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించాలని చెప్పిన వెంటనే ధరలు పెంచడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. విద్యుత్ వాహనాల వినియోగంపై సూచనలు చేయడం కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడానికేనని ఆరోపించారు. వంటనూనెల వినియోగాన్ని పరిమితం చేయాలని చెప్పడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని, ప్రజలు ఏమి తిని బ్రతకాలనే పరిస్థితి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. బంగారం కొనుగోళ్లు ఏడాది పాటు మానుకోవాలని సూచించడం విడ్డూరంగా ఉందని, ఆ రంగంపై ఆధారపడి జీవించే వ్యాపారులు, కార్మికులు ఎలా బతకాలని ప్రశ్నించారు. పెళ్లిళ్లు, శుభకార్యాల సమయంలో సామాన్యులు బంగారం కొనకుండా ఎలా ఉంటారని నిలదీశారు. దిగుమతి సుంకాల పెంపుతో బంగారం, వెండి ధరలు పెరగడానికి కేంద్ర ప్రభుత్వమే కారణమని విమర్శించారు. విదేశీ పర్యటనలు మానుకుని దేశీయ పర్యటనలకే పరిమితం కావాలని ప్రజలకు సూచించిన ప్రధానమంత్రి, మరుసటి రోజే ఐదు దేశాల పర్యటనకు వెళ్లడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. వర్క్ ఫ్రం హోమ్, జీవనశైలి మార్పులపై ప్రజలకు సూచనలు చేసే ముందు ప్రభుత్వం తన విధానాలను సరిదిద్దుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయం చేయాలని చెప్పే కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా తీసుకున్న చర్యలు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజలు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మేలు చేయడానికే పనిచేస్తోందని, సామాన్య ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని ఆరోపించారు. దేశ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని ఎస్.రెడ్డి సాహెబ్ హెచ్చరించారు


# వ్యక్తిగత వివాదాలతో జనసేన ప్రతిష్ఠ దెబ్బతీయొద్దు

- బీఎస్పీ ఆరోపణలపై వివరణ ఇవ్వాలి
- గోటితో పోయే అంశాన్ని గొడ్డలి దాకా తెచ్చుకోవద్దు
- జనసేన నాయకులు రాయల్ గణి హితవు



**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 15:** మదనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం రాయల్ తన నిజాయితీని నిరూపించుకోవాలని, బీఎస్పీ నాయకుల ఆరోపణలపై వివరణ ఇవ్వాలని జనసేన నాయకులు రాయల్ గణి పేర్కొన్నారు. శుక్రవారం ది మదనపల్లి ప్రెస్ క్లబ్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరులవంకను జంగాల శివరాం ఆక్రమించారంటూ బీఎస్పీ నాయకులు రెవెన్యూ అధికారుల దగ్గర  ఆధారాలతో సహా నిరూపించినట్లు తెలుపుతున్నారని, దీనిపై జంగాల శివరాం స్పందించి తనపై వస్తున్న కబ్జా ఆరోపణలకు వివరణ ఇవ్వాలన్నారు. వ్యక్తిగత విషయాలను పార్టీ రంగు పులవడం జనసేన పార్టీకి, అధినేత పవన్ కళ్యాణ్ కి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందన్నారు. నిజాయితీ, విలువలతో కూడిన రాజకీయాలే లక్ష్యంగా పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించారని స్పష్టం చేశారు. ప్రస్తుతం జంగాల శివరాం గౌరవప్రదమైన హోదాలో ఉండి ఇలాంటి విమర్శలను ఎదుర్కోవడం అతని రాజకీయ ఎదుగుదలకు మంచిది కాదన్నారు. సిరులు వంక ఆక్రమణ విషయమై బీఎస్పీ నాయకులు పట్టు వదలడం లేదని, ఆధారాలు సంపాదించారని సదరు సమస్యను జనసేన పార్టీ మదనపల్లి ఇంచార్జ్ గంగారపు రాందాస్ చౌదరి దృష్టికి తీసుకెళ్లి సామరస్యంగా పరిష్కరించుకోవాలని హితవు పలికారు. 2014 ఎన్నికల్లో రాందాస్ చౌదరి గెలుపు కోసం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ ఎంతో శ్రమించారని, ఈ విషయం అందరికీ తెలుసునని గుర్తుచేశారు. రాజకీయ పార్టీల నాయకుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఎంతో ముఖ్యమని, దీనిని దృష్టిలో ఉంచుకొని నాయకులు నడుచుకోవాలన్నారు. వందల, వేల ఎకరాలు కబ్జాలు చేసిన వారు చాకచక్యంగా తమ పనులను చక్కబెట్టుకుంటున్నారని, ఈ చిన్న విషయాన్ని జంగాల శివరాం రాయల్  పెంచుకుంటున్నారని వెల్లడించారు. ఇది పెంచుకుంటూ పోతే వేరే పరిణామాలకు దారి తీసే అవకాశం ఉందని, కూటమి పెద్దలను సంప్రదించి ఈ సమస్యకు చెక్ పెట్టాలని జనసేన పార్టీ నాయకుడిగా జంగాల శివరాంకు ఓ శ్రేయోభిలాషిగా చెబుతున్నామన్నారు. కావున వ్యక్తిగత సమస్యలతో జనసేన పార్టీకి, అధినేత ప్రతిష్ట దెబ్బతీయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.


# హీరో రామ్ దర్శకత్వంలో సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్



**వీర పాత్రలో హీరో రామ్ సరికొత్త అవతారం**

హీరో రామ్ పోతినేని తన కెరీర్‌లో మరో కీలక అడుగు వేయబోతున్నారు. నటుడిగా తన వైవిధ్యాన్ని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటూ వచ్చిన రామ్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'తో తొలిసారి లిరిసిస్ట్‌గా మారి ప్రశంసలు అందుకున్నారు. అంతేకాదు, గాయకుడిగానూ తన గాత్రాని వినిపించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. ఇప్పుడు తన 23వ చిత్రంతో దర్శకుడిగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా అధికారికంగా ప్రకటించిన ఈ చిత్రం స్టైలిష్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుంది. తెలుగు సినిమాలో అరుదుగా కనిపించే ఈ జోనర్‌పై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. కొత్తగా శ్రీకారం చుట్టిన ఈ చిత్రాన్ని రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మించనున్నారు. ఈ చిత్రంతో రామ్ పోతినేని నటుడి నుంచి దర్శకులుగా మారిన ఎన్టీఆర్, కృష్ణ, పవన్ కళ్యాణ్ వంటి స్టార్స్ జాబితాలో చేరడం విశేషం. మేకర్స్ విడుదల చేసిన బర్త్‌డే స్పెషల్ పోస్టర్‌లో రామ్ పోషిస్తున్న 'వీర' పాత్రను పరిచయం చేశారు. లెదర్ జాకెట్‌లో వెనుక నుంచి కనిపిస్తున్న రామ్ లుక్ డార్క్, ఇంటెన్స్, రగ్గడ్ వైబ్‌ను క్రియేట్ చేస్తోంది. అతని స్టైలిష్ వి-కట్ హెయిర్‌స్టైల్ పాత్రలోని అగ్రెసివ్ యాటిట్యూడ్‌ను ప్రతిబింబిస్తోంది. పోస్టర్ బ్యాక్‌డ్రాప్‌లో కనిపిస్తున్న ఎరుపు రంగు 'వి'అక్షరం... 'వీర'తో పాటు తిరుగుబాటు, ఆధిపత్యానికి సంకేతంగా నిలుస్తోంది. ఇరువైపులా కనిపించే స్కైస్క్రేపర్స్ క్రైమ్‌తో నిండిన వాతావరణాన్ని సూచిస్తున్నాయి. 'ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వూల్ఫ్ అనే ట్యాగ్‌లైన్ ఒంటరితనం, మానసిక సంఘర్షణలతో నిండిన పాత్రను సూచిస్తోంది. దర్శకుడిగా రామ్ పోతినేని స్వయంగా రూపొందించిన కథతో తెరకెక్కుతున్న ఈ సినిమా ఓ కొత్త తరహా అనుభూతిని ఇవ్వబోతోంది. 'వీర' పాత్రలో రామ్ ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని అవతార్‌లో కనిపించనుండగా, పోస్టర్ నుంచే ఆ ట్రాన్స్‌ఫర్మేషన్ స్పష్టంగా కనిపిస్తోంది. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జూన్‌లో ప్రారంభం కానుండగా, ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## 'పెద్ది- పవర్ ప్లే టూర్




హీరో రామ్ చరణ్ మచ్ నటించిన రూరల్ యాక్షన్-స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'పై రోజురోజుకీ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా భారీ ప్రమోషన్స్‌తో చిత్రబృందం సినిమాపై హైప్‌నుమరో స్థాయికి తీసుకెళ్తోంది. ఇప్పటికే విడుదలైన రెండు హై-వోల్టేజ్ పాటలు, రెండు విభిన్న గ్లింప్సెస్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై భారీ బజ్ ఏర్పడింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. జూన్ 4న గ్రాండ్ పాన్ ఇండియా రిలీజ్‌కు సిద్ధమవుతుండగా, జూన్ 3న స్పెషల్ ప్రీమియర్స్ ప్రదర్శించనున్నారు. ఇదిలా ఉండగా, ఇప్పటివరకు ఎప్పుడూ చూడని రీతిలో పాన్ ఇండియా ప్రమోషనల్ క్యాంపెయిన్‌ను టీమ్ ప్రారంభించింది. 'పెద్ది పవర్‌ప్లే టూర్' ఈనెల 18న ముంబైలో గ్రాండ్ ట్రైలర్ లాంచ్‌తో ప్రారంభం కానుంది. అన్ని ప్రధాన భాషల్లో థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. అలాగే ఈనెల 22న ఉప్పల్ స్టేడియంలో జరగనున్న ఎస్ ఆర్ హెచ్, ఆర్ సి బి మ్యాచ్ సందర్భంగా చిత్రబృందం ప్రత్యేకంగా హాజరు కానుండటం ప్రధాన ఆకర్షణగా మారనుంది. అనంతరం ఈనెల 23న భోపాల్, 24న బెంగళూరు, 28న ఢిల్లీ, 30న చెన్నై, జూన్ 1న విజయనగరం, జూన్ 2న హైదరాబాద్‌లో భారీ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. అంతేకాదు, సమ్మర్ అంతా హైప్ కొనసాగించేలా మరిన్ని సర్‌ప్రైజ్‌లు కూడా సిద్ధం చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు.

## లీలావతిగా కీలక పాత్ర



అభిషేక్ నామా దర్శకత్వంలో విరాట్ కర్ణా నటించిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం జూలై 3న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. ప్రతీ అప్‌డేట్‌తో ఈ చిత్రంపై బజ్ నెక్స్ట్ లెవల్ కి చేరుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్, సాంగ్స్ సినిమాపై మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి అనసూయ భరద్వాజ్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. 'లీలావతి' పాత్రలో ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా, మిస్టీరియస్‌గా కనిపిస్తోంది. సంప్రదాయ తెలుపు చీరలో, ట్రైబల్ జ్యువెలరీతో అనసూయ కనిపించిన తీరు పాత్రలోని తీవ్రతను ప్రతిబింబిస్తోంది. లీలావతి పాత్ర కథలో ఎంతో కీలకంగా ఉండబోతోందనే ఫీల్ ఈ పోస్టర్‌తోనే స్పష్టమవుతోంది. ఈ సినిమాలో నభా నటేష్, ఐశ్వర్యా మీనన్, రిషబ్ సాహ్నీ, జగపతి బాబు, గరుడ రామ్, మహేష్ మాంజ్రేకర్, జయప్రకాశ్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ నిర్మాణంలో వస్తున్న 'నాగబంధం' పౌరాణికం, చరిత్ర, యాక్షన్ అంశాల కలయికగా రూపొందుతోంది ."నాగబంధందేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రేక్షకులను అలస్తుందనే నమ్మకంతో ఉన్నాం అని మేకర్స్ అన్నారు.

# సూపర్‌కింగ్స్‌కు చెక్

- 7 వికెట్లతో సూపర్‌జెయింట్స్ గెలుపు
- రాణించిన మిచెల్ మార్ష్, ఆకాశ్ సింగ్
- చెన్నై 187/5, లక్నో 188/3

**లక్నో :** ఐపీఎల్ ప్లే ఆఫ్స్ రేసులో చెన్నై సూపర్‌కింగ్స్ అవకాశాలను లక్నో సూపర్‌జెయింట్స్ గట్టిగా దెబ్బకొట్టింది. 188 పరుగుల లక్ష్యాన్ని మరో 20 బంతులు ఉండగానే ఛేదించిన సూపర్‌జెయింట్స్ 7 వికెట్ల తేడాతో అదిరే విజయం సాధించింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (90, 38 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్సలు) విధ్వంసక ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. జోశ్ ఇంగ్లిశ్ (36, 32 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి తొలి వికెట్‌కు 135 పరుగుల భారీ భాగస్వామ్యం నిర్మించిన మిచెల్ మార్ష్.. సూపర్‌జెయింట్స్ విజయాన్ని లాంఛనం చేశాడు. 21 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన మార్ష్.. సెంచరీకి పది పరుగుల దూరంలో వికెట్ కోల్పోయాడు. నాన్ స్ట్రయిక్ ఎండ్‌లో రనౌట్‌తో మార్ష్ మెరుపులకు తెరపడింది. ఇంగ్లిశ్ ఎదురుదాడి చేయటంలో వెనుకంజ వేసినా.. మార్ష్ దంచికొట్టాడు. పవర్‌ప్లేలో సూపర్‌జెయింట్స్‌ను 86/0తో బలమైన స్థితిలో నిలిపాడు. పేసర్లు, స్పినర్లపై అలవోకగా బౌండరీలు బాదాడు. పిచ్ పేస్, బౌన్స్‌కు అనుకూలించినా.. మార్ష్, ఇంగ్లిశ్ సూపర్‌కింగ్స్ పేసర్లు, స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అబ్దుల్ సమద్ (7) నిరాశపరిచినా.. నికోలస్ పూరన్ (32 నాటౌట్, 17 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సలు), ముకుల్ చౌదరి (13 నాటౌట్, 10 బంతుల్లో 2 ఫోర్లు) 16.4 ఓవర్లలోనే లాంఛనం ముగించారు. అన్షుల్ కాంబోజ్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్లో నికోలస్ పూరన్ వరుసగా 4 సిక్సర్లతో చెలరేగాడు. ఆఖరు ఓవర్‌కు వరకూ వెళ్తుందనుకున్న మ్యాచ్‌ను ముందే ముగించాడు. మిచెల్ మార్ష్ సైతం అన్షుల్ కాంబోజ్ వేసిన ఓ ఓవర్లో నాలుగు సిక్సర్లు, ఓ ఫోర్‌తో ఏకంగా 28 పరుగులు పిండుకున్నాడు. ఈ సీజన్లో సూపర్‌జెయింట్స్‌కు ఇది నాల్గో విజయం కాగా, సూపర్‌కింగ్స్‌కు ఆరో ఓటమి.





**-రాణించిన కార్తీక్ శర్మ**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 187 పరుగులు చేసింది. పిచ్ నుంచి పేసర్లకు మంచి బౌన్స్ లభించటంతో పరుగులు చేయటం కష్టమైంది. రుతురాజ్ గైక్వాడ్ (13), ఉర్విల్ పటేల్ (6), సంజు శాంసన్ (20) నిరాశపరిచారు. కార్తీక్ శర్మ (71, 42 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సలు) బాధ్యతాయుత అర్థ సెంచరీతో రాణించాడు. డెవాల్డ్ బ్రెవిస్ (25, 16 బంతుల్లో 2 సిక్సలు), శివం దూబె (32 నాటౌట్, 16 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సలు) ఆకట్టుకున్నారు. ప్రశాంత్ వీర్ (13 నాటౌట్) ధనాధన్ ముగింపు అందించటంలో నిరాశపరిచాడు. సూపర్‌జెయింట్స్ పేసర్ ఆకాశ్ సింగ్ (3/26) మూడు వికెట్ల ప్రదర్శనతో సూపర్‌కింగ్స్‌ను కట్టడి చేశాడు.

**స్కోరు వివరాలు**

చెన్నై సూపర్‌కింగ్స్ : 187/5 (కార్తీక్ శర్మ 71, శివం దూబె 32, బ్రెవిస్ 25, ఆకాశ్ సింగ్ 3/26, మహ్మద్ షమి 1/41)

లక్నో సూపర్‌జెయింట్స్ : 188/3 (మిచెల్ మార్ష్ 90, జోశ్ ఇంగ్లిశ్ 36, నికోలస్ పూరన్ 32, ముకేశ్ చౌదరి 1/24, స్పెన్సర్ జాన్సన్ 1/39)

## పంచ్‌కు 17 మెడల్స్

- ఆసియా అండర్-17 బాక్సింగ్ పోటీలు



తాష్కెంట్ (ఉబ్బెకిస్తాన్) : ఆసియా అండర్15, అండర్17 బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌ను టీమ్ ఇండియా ఘనంగా ముగించింది. రెండు వయో విభాగాల్లో బాలురు, బాలికలు ఏకంగా 17 పతకాలు సాధించారు. ఇందులో రెండు పసిడి, ఏడు రజత, ఎనిమిది కాంస్య పతకాలు ఉన్నాయి. అండర్-17 బాలికలు 12 పతకాలు అందుకున్నారు. అండర్-17 బాయ్స్ ఐదు పతకాలు సాధించారు. బాలికల 46 కేజీల విభాగంలో రాఖి పసిడి పతకం సాధించగా, 57 కేజీల విభాగంలో నవ్య సైతం స్వర్ణం అందుకుంది. ఖుషి చంద్ (48కేజీలు), దివ్య (63 కేజీలు), హిమాన్షి (70 కేజీలు), జ్యోతి (75 కేజీలు), వాన్షిక (80 కేజీలు)లు రాణించారు.

## సెమీస్ కు సాత్విక్-చిరాగ్

- సింగిల్స్ లో ఓడిన సింధు,
లక్ష్యసేన్ థాయ్ లాండ్ ఓపెన్




బ్యాంకాక్: థాయ్ లాండ్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లోకి భారత పురుషుల జంట చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ ప్రవేశించగా.. సింగిల్స్ లో పివి సింధు, లక్ష్యసేన్ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ 21-12, 21-13తో వరుససెట్లలో టకుమి నొమురా-యుచీ షిమోగామి(జపాన్) జంటను ఓడించారు. ఇక 6వ సీడ్ సింధు మూడు సెట్ల హోరాహోరీ పోరులో టాప్ సీడ్, జపాన్ కు చెందిన యమగుచి చేతిలో పోరాడి ఓడింది. తొలి గేమ్ ను సింధు 21-19తో తొలి గేమ్ గెలిచినా.. ఆ తర్వాత రెండు గేమ్ లను 18-21, 15-21తో చేజార్చుకొని పరాజయం పాలైంది. ఇక పురుషుల సింగిల్స్ లో లక్ష్యసేన్ 19-21, 16-21తో 2వ సీడ్, థాయ్ లాండ్ కు చెందిన విదిత్ శరణ్ చేతిలో పోరాడి ఓడాడు. దీంతో ఈ టోర్నీలో భారత పురుషుల డబుల్స్ జోడీ ఒక్కటి మాత్రమే ప్రవేశించింది.

# గోమాతల పరిరక్షణలో దాతల సహకారం ప్రశంసనీయం

## - టిటిడి జేఈవో డా. ఎ. శరత్




**తిరుపతి –ఆంధ్రనాడు, మే 15:** టిటిడి ఎస్వీ గోశాలకు భక్తులు, దాతలు విరాళంగా అందించిన 180 లారీల ఎండుగడ్డిని అకాల వర్షాల నుండి రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని టిటిడి జేఈవో (వైద్యం , విద్య) డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అధికారులతో కలిసి ఎస్వీ గోశాలను పరిశీలించిన ఆయన, గోవుల సంరక్షణ, ఎండుగడ్డి నిల్వలు, మౌలిక సదుపాయాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా గోమాతల సేవలో భాగంగా ఎండుగడ్డి దానాన్ని అందించిన టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, నెహ్రూ ఫౌండేషన్, శ్రీనివాస సేవా ట్రస్ట్ ఛైర్మన్ టి. సత్యనారాయణలను జేఈవో ప్రత్యేకంగా అభినందించారు.

గోసంరక్షణ మహోన్నతమైన ధార్మిక సేవ అని పేర్కొంటూ, గోవుల పరిరక్షణకు మరింత మంది దాతలు ముందుకు వస్తే టిటిడి సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు.గోశాలకు దానంగా వచ్చిన ఎండుగడ్డిని శాస్త్రీయ విధానంలో విభజించి నిల్వ చేయాలని, వర్షాల ప్రభావం లేకుండా టార్పాలిన్ కవర్లతో భద్రపరచాలని అధికారులకు సూచించారు. గోవులకు ఎటువంటి ఆహార కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పరిశీలన**

టిటిడి ఆధ్వర్యంలో స్వదేశీ ఆవుల జన్యు పరిరక్షణ, అభివృద్ధి లక్ష్యంగా నిర్మాణంలో ఉన్న "సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్"లో పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జేఈవో సూచించారు.సెంటర్ పూర్తయిన అనంతరం పాలు ఇచ్చే ఆవుల సంఖ్య, భవిష్యత్తులో అవసరమయ్యే పాల ఉత్పత్తి సామర్థ్యం, పాలు సేకరణ, నెయ్యి తయారీ, పెరుగు--మజ్జిగ పంపిణీ, మానవ వనరుల వినియోగం తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పూర్తయితే ప్రతి షెడ్లో 250 ఆవుల సామర్థ్యంతో గోవులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. అలాగే గోవుల మేటర్నిటీ షెడ్, ఆధునిక మిల్కింగ్ పార్లర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎస్వీ గోశాల డైరెక్టర్ డా. ఏవీఎన్ శివకుమార్, డిఈ శ్రీ దామోదర్, మేనేజర్లు మృదుల, గౌరీ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి సమస్యకు చెక్..

## - కొత్త బోర్లు ప్రారంభించిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా





**మదనపల్లి –ఆంధ్రనాడు, మే 15:** వేసవిలో తాగునీటి సమస్య నివారణ కోసం మదనపల్లి గ్రామీణ మండలం కోళ్లబైలు పంచాయతీ సచివాలయం ఎదురుగా,కోళ్లబైలు -1 పంచాయతీలోని మసీదు సమీపాన డ్రిల్ చేసిన తాగునీటి బోర్లను,మదనపల్లి మున్సిపల్ పరిధిలోని రింగ్ రోడ్ ఇంజనీర్స్ కాలనీ నందు నూతనంగా డ్రిల్ చేసిన బోర్వెల్ కు ఏర్పాటు చేసిన మోటార్లను ఎమ్మెల్యే షాజహాన్ బాషా శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు.స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి మండల అధికారులు వెంటరాగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మోటార్లు ఆన్ చేసి ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో మదనపల్లి నియోజకవర్గంలో పెద్దఎత్తున బోరు మోటర్లు డ్రిల్ చేసి నూతనంగా మోటార్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని,వేసవిలో తాగనీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల,డిఈ శ్రావణి,తెలుగుదేశం నాయకులు కమలామర్రి కృష్ణ,రాటకొండ భారతి,శ్రీరామ నాగమణి,నవీన్ చౌదరి, తెలుగుదేశం పార్టీ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీని ఉపయోగించుకోండి

## - కుప్పం మార్కెట్ కమిటీ చైర్మన్ జిఎం రాజు



**రామకుప్పం–ఆంధ్రనాడు, మే 15:** రామకుప్పం మండలంలోని రైతు మిత్ర గ్రూపులకు శిక్షణ కార్యక్రమాన్ని కుప్పంమార్కెట్ కమిటీ చైర్మన్ జిఎం రాజు అధ్యక్షతన ప్రారంభించారు ఆయన మాట్లాడుతూ రైతు సంఘాలు మండలంలో 231 ఉన్నాయని రైతు సంఘాల గ్రూపులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను వివరించారు రైతు మిత్ర గ్రూపులు తమ గ్రూపు కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 50% నుంచి 70% వరకు ఇచ్చే సబ్సిడీని ఉపయోగించు కోవచ్చని సూచించారు దీనితో పాటు వివిధ రకాల పంటల గురించి మార్కెటింగ్ గురించి ఆయన వివరించారు ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి పల్లవి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పవన్ కుమార్ మునీంద్ర నాయక్ రైతు సంఘాల అధ్యక్షుడు ఆనంద్ శెట్టి ఏబీఎన్ శ్రీనివాస్ మూర్తి వెలుగు సిబ్బంది రైతులు మహిళలు పాల్గొన్నారు.




Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733